# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 12 | సంచిక: 121 | సోమవారం | 01-12-2025 | పేజీలు: 08 | వెల రూ. 3 | www.epaperjournalistdiary.com


"సఃకుటుంబానాం" ట్రైలర్ లాంచ్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు..!



08


జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

జర్నలిస్ట్ డైరీ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

81062 74466


# కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం..

- కొండగట్టు వద్ద గత రాత్రి భారీ అగ్నిప్రమాదం
- 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా దగ్ధం
- సమ్మక్క జాతర కోసం నిల్వ ఉంచిన సరుకు బూడిద
- కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరిగిందని అంచనా
- విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమిక నిర్ధారణ





**జర్నలిస్ట్ డైరీ, జగిత్యాల:**
జగిత్యాల జిల్లాలోని కొండగట్టులో భాభీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ తో నిన్న అర్ధరాత్రి దుకాణాల్లో మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో 30 చిన్న దుకాణాలను మంటలు చుట్టుముట్టాయి. ఒకదానికొకటి అంటుకుని 30 షాప్స్ అంటుకోవడంతో భారీగా ఆస్తి నష్టం..వాటిల్లింది. దుకాణాలు అంటుకోవడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఘటనలోబొమ్మల దుకాణాలు

మిగతా 2వ పేజీలో..



## అభివృద్ధికి మూడు సూత్రాలు: సీఎం రేవంత్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
గ్లోబల్ సమ్మిట్‌లో పాలసీ డాక్యుమెంట్‌ను ప్రకటిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విజన్ డాక్యుమెంట్‌కు తెలంగాణ రైజింగ్ 2047 అని పేరు పెట్టుకున్నామని తెలిపారు.

మిగతా 2వ పేజీలో..



## ఎన్నికల కమిషనర్‌కు కల్వకుంట్ల కవిత ఫోన్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
ప్రభుత్వం సొమ్ముతో ప్రచారమా? అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 'ఎక్స్'లో విమర్శించారు. ఎన్నికలు గ్రామాల్లో ఉంటే జిల్లా కేంద్రాలకు వెళ్లి సీఎం అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారట అని ఎద్దేవా చేశారు. అక్కడికి జిల్లా ప్రజలందరినీ ప్రభుత్వం సొమ్ముతో తరలించి తమ సందేశం ఇస్తారట అని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ ఎన్నికల నిబంధనను ఉల్లంఘించటమే అని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఈ విషయంలో జోక్యం చేసుకుని, సీఎం పర్యటనను నిలిపివేయాలని

మిగతా 2వ పేజీలో..



## ప్రకృతి సిద్ధ వ్యవసాయానికి రైతులు మొగ్గు చూపాలి

- ఎంపీ ఈటెల

2

# రాష్ట్రం 3 విభాగాలుగా వర్గీకరణ..

## ఔటర్ ఔట్‌సైడ్ కొత్తగా రీజినల్ రింగురోడ్డు

- స్ట్రాటజీలో భాగంగా తెలంగాణను మూడు విభాగాలుగా తీసుకున్నాం
- కాలుష్య రహిత నగరంగా మార్చాలంటే దీన్ని క్యూర్ చేయాల్సిందే
- ఔటర్ లోపల నాలుగు విభాగాలు ఉండేవి, దాంతో గందరగోళం ఏర్పడింది
- అందుకే ఈ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించాం
- కోర్ అర్బన్ రీజియన్‌ను ఒక విభాగంగా తీసుకున్నాం -సీఎం రేవంత్ రెడ్డి

5





## గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

- రేవంత్ సర్కారుపై హరీశ్ ఫైర్
- కాంగ్రెస్, బీజేపీలు తోడు దొంగలంటూ హరీశ్ రావు విమర్శ
- గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అంటూ ఎద్దేవా
- స్థానిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను నిలదీయాలని పిలుపు

2



## కొండగట్టు అగ్నిప్రమాద ఘటనపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

- ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం వల్లే నష్టం పెరిగిందని కేటీఆర్ విమర్శ
- బాధిత కుటుంబాలకు రూ. 30 లక్షల చొప్పున సాయం అందించాలని డిమాండ్
- బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా

2

## పార్లమెంట్ లో తెలంగాణ సమస్యలను ప్రస్తావిస్తాం

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

5

## 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ మా లక్ష్యం

- 2037 వరకు తెలంగాణ 1 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలన్నదే మా లక్ష్యం
- 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలన్నదే మా తుది లక్ష్యం
- దాంట్లో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ పాలసీ రూపొందిస్తున్నాం
- సంక్షేమం, అభివృద్ధి సమానంగా ఉండేలా ప్రణాళిక మంత్రి శ్రీధర్‌బాబు



2

## తెలంగాణ పంచాయతీ ఎన్నికలు... తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు

- తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 25 వేలకు పైగా నామినేషన్లు దాఖలు
- 4,236 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ
- డిసెంబర్ 11న తొలి దశ పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- మొత్తం మూడు విడతల్లో 12,728 పంచాయతీలకు ఎన్నికలు
- కేంద్ర నిధుల కోసమే ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ

2






## దక్షిణాఫ్రికాతో ఉత్కంఠ పోరులో.. భారత్‌దే గెలుపు

**జర్నలిస్ట్ డైరీ, రాంచీ:**
దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ప్రత్యర్థిపై టీమ్‌ఇండియా 17 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత్ నిర్దేశించిన 350 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 49.2 ఓవర్ల వద్ద 332 పరుగులకు ఆలౌటైంది. మాథ్యూ (72), యాన్సన్ (70), బాష్ (67) కంగారు పెట్టినా.. గెలుపు భారత్ వశమైంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో టీమ్‌ఇండియా 10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కోహ్లీ..**

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ అనగానే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపైనే అందరి దృష్టి ఉంది. అభిమానుల అంచనాలను

మిగతా 3వ పేజీలో..



## అభివృద్ధికి మూడు సూత్రాలు: సీఎం రేవంత్

**మొదటిపేజీ తరువాయి**

“విజన్ డాక్యుమెంట్‌లో లక్షలాది మందిని భాగం చేశాం. అభివృద్ధి చెందిన తెలంగాణను అందించాలన్నదే మా లక్ష్యం. ఐఎస్‌బీ, నీతి ఆయోగ్ సంస్థల సలహాలు కూడా తీసకున్నాం. స్ట్రాటజీలో భాగంగా తెలంగాణను మూడు విభాగాలుగా తీసుకున్నామని వివరించారు. కోర్ అర్బన్, రీజియన్ ఎకనామిగా హైదరాబాద్ మాడిఫికేషన్ చేశారు. ఓఆర్ఆర్ పరిధిలో మున్సిపల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలు ఉండడం వల్ల వ్యవస్థల మధ్య సమన్యాయం లోపిస్తుంది. అందుకే కోర్ అర్బన్ రీజియన్ ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నాం” అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

“కాలుష్య రహితనగరంగా హైదరాబాద్‌ను మారుస్తాం. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను తరలిస్తాం. కోర్ అర్బన్ రీజియన్‌ను తీసుకొస్తున్నాం. వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంతో పాటు రామగుండంలో ఎయిర్‌పోర్టులు నిర్మిస్తాం. కోర్, ప్యూర్, రేర్ రీజియన్లుగా తెలంగాణను అభివృద్ధి చేస్తాం. సమగ్రంగా మూడు రీజియన్ల అభివృద్ధి చేపడతాం. సర్వీస్ సెక్టార్‌గా కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధి చేస్తాం. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య ప్రాంతాన్ని పెరీ అర్బన్ రీజియన్‌గా గుర్తించాం” అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



## కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం..

**మొదటిపేజీ తరువాయి**

కాలి బూడిదైపోయాయి. దుకాణాలనే నమ్ముకుని బ్రతుకుతున్న వ్యాపారులు లబోదిబో మంటున్నారు. ఫైర్ ఇంజిన్స్ సాయంతో మంటలను ఆర్పేసిన ఆస్తి నష్టం మాత్రం భారీగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల తెలంగాణలో పలు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీ, మధురానగర్ ప్రాంతాల్లో జరిగిన ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగించాయి. హైదరాబాద్ ఓల్డ్ సిటీ (బోయిగూడ, ఛత్రినాక పరిధి)లో ఈ ఏడాది మే 20, జీ ప్లస్ 2 భవనంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రెండో అంతస్తులో ఉన్న చెప్పుల గోదాంలో మంటలు వ్యాపించాయి

అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పాతబస్తీలోని శాలిబండలో నవంబర్ 24, 2025న గోమతి ఎలక్ట్రానిక్స్ షోరూంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఎనిమిది మంది గాయపడ్డారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు.



## ప్రకృతి సిద్ధ వ్యవసాయానికి
## రైతులు మొగ్గు చూపాలి

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

దేశ ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన తరువాత వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చేసుకొచ్చి రైతులకు వెనుదన్నుగా నిలిచారని ఎంపీ ఈటెల రాజేందర్‌పేర్కొన్నారు. ఆదివారం 128 వ మన్ కీ బాత్ ముగిసిన తరువాత మాట్లాడుతూ అన్ని రంగాలు అభివృద్ధి చెందితేనే దేశం సమగ్ర అభివృద్ధి చెందుతుందని మోడీ బావించినట్లు తెలిపారు.

వారు ఆశించినట్లు వ్యవసాయంలో మార్పు తీసుకుని వచ్చి అనారోగ్యం దరిచేరని విధంగా మన రైతులు పంటలు పండిస్తారని పేర్కొన్నారు. అన్ని రంగాల గురించి ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన పలు విషయాలను ప్రస్తావిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు తీసుకున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో ఉన్న నిష్ణాతులను దేశానికి పరిచయం చేస్తున్నారని, ఒకప్పుడు మన దేశంలో ఇంత ఎరువులు, క్రిమి సంహారకాల వాడకం ఉండేది కాదు. ప్రకృతి సిద్ధంగా వ్యవసాయం చేసేవారు.

ప్రస్తుతం ఉత్పత్తి పెంచడం కోసం భూమిని విషతుల్యం చేస్తున్నాం, క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. దీంతో క్యాన్సర్ కేసుల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నుండి బయటపడటానికి ప్రకృతి సిద్ధ వ్యవసాయం చేద్దామని ప్రధాని పిలుపునిచ్చారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇది నిజం చేయాలని కోరారు. మనిషిలో మార్పు వస్తుందని ఎథిక్స్, విలువలు, సంప్రదాయాల గురించి ఆలోచన చేస్తున్నారు. భారత దేశ ఔన్నత్యాన్ని పెంచుతున్న మోడీ కృషి అభినందనీయమన్నారు.

## సర్పంచ్ ఏకగ్రీవాలపై
## మంత్రి జూపల్లి సంచలన వ్యాఖ్యలు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

సర్పంచ్‌ల ఏకగ్రీవాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు చేసుకోవడం తప్పుకాదు.. కానీ డబ్బులు పెట్టి కొనడం కరెక్ట్ కాదన్నారు. డబ్బులు పెట్టి కొంటే అది ఏకగ్రీవం కాదని.. అలా చేస్తే ప్రజాకంఠకులు అవుతారని కీలక వ్యాఖ్యలు చేశారు. డబ్బు ఉందనే అహంకారంతో ఎవరూ పదవులు కొనుగోలు చేయొద్దని సూచించారు. బలవంతపు ఏకగ్రీవాలే కాదు.. వేలం పాట ద్వారా పదవులు పొందడాన్ని కూడా తాను సమర్థించను అని అన్నారు. ఇదిలా ఉంటే.. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి నామినేషన్‌ల ప్రక్రియ శనివారం ముగిసింది. ఇవాల్టి నుంచి రెండో విడత ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఈ విడతలో మొత్తం 31 జిల్లాల్లో 193 మండలాల్లో 4333 సర్పంచ్‌స్థానాలకు, 38350 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. డిసెంబర్ 14న ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఓట్లను లెక్కించనున్నారు.

# తెలంగాణ పంచాయతీ ఎన్నికలు... తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు

- తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 25 వేలకు పైగా నామినేషన్లు దాఖలు
- 4,236 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ
- డిసెంబర్ 11న తొలి దశ పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- మొత్తం మూడు విడతల్లో 12,728 పంచాయతీలకు ఎన్నికలు
- కేంద్ర నిధుల కోసమే ముందుగా గ్రామ




### పంచాయతీ ఎన్నికల నిర్వహణ

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతకు నామినేషన్ల పర్వం ముగిసింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో డిసెంబర్ 11న జరగనున్న మొదటి దశ ఎన్నికల కోసం సర్పంచ్ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు గాను 25,654 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల చివరి రోజైన శనివారం ఒక్క రోజే 17,940 మంది తమ పత్రాలు సమర్పించడం విశేషం.

అటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 37,440 వార్డులకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం అధికారులు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రికి ప్రకటించే అవకాశం ఉంది. నామినేషన్లపై అభ్యంతరాలను డిసెంబర్ 1న స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 4 చివరి తేదీ.

షెడ్యూల్ ప్రకారం తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు, 1,12,242 వార్డులకు మూడు దశల్లో (డిసెంబర్ 11, 14, 17) ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

15వ ఆర్థిక సంఘం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.3,000 కోట్ల నిధులు 2026 మార్చి 31కి మురిగిపోనున్న నేపథ్యంలో, రాష్ట్ర కేబినెట్ ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా, బీసీలకు 17.08 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

# కొండగట్టు అగ్నిప్రమాద ఘటనపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

- ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం వల్లే నష్టం పెరిగిందని కేటీఆర్ విమర్శ
- బాధిత కుటుంబాలకు రూ. 30 లక్షల చొప్పున సాయం అందించాలని డిమాండ్
- బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే భారీ ఆస్తి నష్టం జరిగిందని ఆరోపించారు. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ఒక్కో కుటుంబానికి రూ. 30 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో సుమారు 30 దుకాణాలు పూర్తిగా కాలిపోయి, దాదాపు కోటి రూపాయల ఆస్తి నష్టం జరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం అప్పులు చేసి దుకాణాలు పెట్టుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడ్డాయని విచారం వ్యక్తం చేశారు.

అగ్నిమాపక శకటాలు సకాలంలో ఘటనా స్థలానికి చేరుకోకపోవడమే నష్టం పెరగడానికి ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. జగిత్యాల ఫైరింజన్ మరమ్మతులో ఉండటం, వచ్చిన మరో ఇంజన్ పని చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ వైఫల్యానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సాయం అందించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కేటీఆర్ అభినందించారు. నష్టపోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించకపోతే, పార్టీ తరఫున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## రవికి రేపు బెయిల్ వస్తుందా?

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

పైరసీ సినిమాల కేసులో అరెస్ట్ అయిన ఇమంది రవి ప్రస్తుతం రిమాండ్ లో ఉన్న సంగతి తెలిసిందే. రవిని అరెస్ట్ చేసిన తవరాత పోలీసులు కస్టడీ విచారణలోకి తీసుకున్నారు. ఎనిమిది రోజుల విచారణలో ఐబొమ్మకు సంబంధించి పలు కీలక ఆధారాలను సైబర్ క్రైమ్ పోలీసులు రాబట్టారు. రవిపై పైరసీతో పాటు బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ సహా పలు కేసులు బుక్ చేశారు. కాగా రేపు మరో మూడు కేసుల్లో రవిని పోలీసులు కోర్టు ముందు హాజరుపరచనున్నారు. ఈ మూడు కేసుల్లో సైతం రవిని కస్టడీకి తీసుకుని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు రేపు రవి బెయిల్ పిటిషన్ పైనా విచారణ జరగనుంది. దీంతో రవిని కోర్టు కస్టడీకి అప్పగిస్తుందా? లేదంటే బెయిల్ మంజూరు చేస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

- రేవంత్ సర్కారుపై హరీశ్ ఫైర్
- కాంగ్రెస్, బీజేపీలు తోడు దొంగలంటూ హరీశ్ రావు విమర్శ
- గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అంటూ ఎద్దేవా
- స్థానిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను నిలదీయాలని పిలుపు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలూ తోడు దొంగలని, వారి మధ్య 'గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ' నడుస్తోందని ఆయన ఆరోపించారు. కల్వకుర్తికి చెందిన పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్‌లో ఆయన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా హరీశ్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు.



రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను కాపాడటంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజలకు బాకీ పడిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను 'మా బాకీ పైసలు ఎప్పుడు ఇస్తారు?' అని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ, తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తేలేకపోయారని విమర్శించారు. పక్క రాష్ట్రాలకు కేంద్రం వేల కోట్లు కేటాయిస్తుంటే, తెలంగాణకు మాత్రం మొండిచెయ్యి చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో కళకళలాడిన హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలు రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల వెలవెలబోతున్నాయని, రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేశారని దుయ్యబట్టారు.

గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను ప్రజలు నిలదీయాలని ఆయన కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## ఎన్నికల కమిషనర్‌కు
## కల్వకుంట్ల కవిత ఫోన్

**మొదటిపేజీ తరువాయి**

కోరారు. అలాగే.. ప్రభుత్వ సొమ్ముతో సీఎం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం కోసం ఆరు జిల్లాల్లో ప్రచార సభలు నిర్వహించడంపై ఆదివారం ఉదయం రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ జాగృతి ఫిర్యాదు చేసింది. అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదినితో కవిత ఫోన్‌లో మాట్లాడారు. ప్రజాధనం అక్రమ మార్గాల్లో ఖర్చు చేసి ఎన్నికల్లో అనుచిత లబ్ధిపొందాలని చూస్తున్నారని వివరించారు. ఈ మేరకు కమిషనర్ స్పందించినట్లు తెలిపారు. సీఎం జిల్లాల పర్యటనలపై సీరియస్‌గా దృష్టి సారించామని వెల్లడించారని తెలిపారు. జిల్లాల పర్యటనలకు కలెక్టర్లు హాజరు కాకుండా ఆదేశాలు ఇచ్చే విషయం పరిశీలిస్తున్నామని పేర్కొన్నారని తెలిపారు.

**4 నుంచి జాగృతి జనంబాట కొనసాగింపు**



కవిత చేపట్టిన జాగృతి జనంబాట యాత్రను ఈ నెల 4వ తేదీ నుంచి కొనసాగించనున్నారు. అక్టోబర్ 25వ తేదీన నిజామాబాద్‌లో కవిత జనంబాట యాత్ర ప్రారంభించారు. మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్‌హన్మకొండ, నల్గొండ, మెదక్, ఖమ్మం, రంగారెడ్డి, వనపర్తి, కామారెడ్డి జిల్లాల్లో యాత్ర పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ రావడంతో గ్రామీణ జిల్లాల్లో యాత్రను నిలిపివేశారు. ఎన్నికల కోడ్ లేని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో నాలుగో తేదీ నుంచి ఏడో తేదీ వరకు యాత్ర నిర్వహించనున్నారు. హైదరాబాద్ జిల్లాలో డిసెంబర్ 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు యాత్ర చేపడుతారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 18, 19 తేదీల్లో, గద్వాల జిల్లాలో 21, 22 తేదీల్లో యాత్ర నిర్వహిస్తారు. యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, సూర్యాపేట, సిరిసిల్ల, జనగామ, భూపాలపల్లి, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, ములుగు, జగిత్యాల, మహబూబాబాద్, నిర్మల్, నారాయణపేట, సిద్దిపేట, మంచిర్యాల జిల్లాలో ఫిబ్రవరి మూడో వారం వరకు యాత్ర కొనసాగిస్తారు.

# 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ మా లక్ష్యం

- 2037 వరకు తెలంగాణ 1 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలన్నదే మా లక్ష్యం
- 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలన్నదే మా తుది లక్ష్యం
- దాంట్లో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ పాలసీ రూపొందిస్తున్నాం
- సంక్షేమం, అభివృద్ధి సమానంగా ఉండేలా ప్రణాళిక. -మంత్రి శ్రీధర్‌బాబు



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ‘తెలంగాణ రైజింగ్ 2047’ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా, ఈ విజన్ పాలసీ లక్ష్యాలు, ప్రణాళికలపై ఆయన కీలక వివరాలను వెల్లడించారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. “తెలంగాణను 2037 వరకు 1 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలన్నదే మా తక్షణ లక్ష్యం. అలాగే, 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలన్నదే మా తుది లక్ష్యం. ఈ లక్ష్యాలను సాధించేందుకు వీలుగానే మేము తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ పాలసీని రూపొందిస్తున్నాం,” అని స్పష్టం చేశారు. ఈ ప్రణాళికలో ముఖ్యంగా సంక్షేమం, అభివృద్ధి సమానంగా ఉండేలా చూస్తున్నామని, వాటి మధ్య సమతుల్యతను కొనసాగించాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు.

ఈ విజన్ డాక్యుమెంట్ నాలుగు కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు సంబంధించినదని పేర్కొంటూ, దాని రూపకల్పనలో విస్తృత ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని శ్రీధర్ బాబు వెల్లడించారు. దాదాపు 4 లక్షల మంది ప్రజల సూచనలు, ముఖ్యంగా యువకుల అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నామని ఆయన చెప్పారు. అంతేకాకుండా, అన్ని రంగాల్లోని మేధావులు, నిపుణులతో ఇప్పటివరకు దాదాపు 70 సమావేశాలు ఏర్పాటు చేశామని, అందరి అభిప్రాయాలను తీసుకున్న తరువాతే విజన్ డాక్యుమెంట్‌ను తుది రూపు ఇస్తున్నామని మంత్రి తెలిపారు.

మూడు ట్రిలియన్ ఎకానమీని ఎలా సాధ్యం చేయాలి అనే అంశాలపై ఇప్పటికే తమ బృందం విస్తృత కసరత్తు చేసిందని ఆయన వివరించారు. ఈ విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్‌లో అధికారికంగా ఆవిష్కరించనున్నట్టు మంత్రి తెలిపారు. పెట్టుబడులతో పాటు, కీలకమైన సలహాలు ఇవ్వడానికి చాలా మంది పారిశ్రామికవేత్తలు ఈ గ్లోబల్ సమ్మిట్‌కి వస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలియజేశారు.





# కొండగట్టు బాధితులకు ప్రభుత్వ సహాయం..

- **అగ్ని ప్రమాదం ఘటనలో బాధితులకు అండగా ఉంటాం**
- **జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**

**జర్నలిస్ట్ డైరీ, మల్యాల (నవంబర్ 30):**

జగిత్యాల జిల్లా కొండగట్టులో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సుమారుగా 20 దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం వెంటనే అగ్ని ప్రమాద స్థలానికి చేరుకుని, కారణాలను పరిశీలించారు. ప్రమాదం జరిగిన వెంటనే, అగ్నిమాపక, పోలీసులు సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని, అత్యవసర సేవలు చేపట్టారు. బాధితులను తాత్కాలికంగా స్థానిక పాఠశాలకు తరలించారు. వారికి ఆహారం, వస్త్రాలు, ఇతర సహాయాలు అందించారు. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ప్రమాదానికి గురైన బాధిత షాప్స్ కుటుంబాలకు ప్రభుత్వం తరపున సహాయం అందజేస్తామని, బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు.





# సర్పంచులుగా గెలిపించే బాధ్యత స్థానిక నాయకులదే

- **మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**జర్నలిస్ట్ డైరీ, తిమ్మాపూర్(నవంబర్30):**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసే అభ్యర్థులను గెలిపించే బాధ్యత ఆయా గ్రామాల పార్టీ నాయకులపైనే ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. తిమ్మాపూర్ మండలం పోలంపల్లి, నర్సింగపూర్ గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులుగా ఖరారైన బొడిగె జ్ఞానేశ్వరికొండయ్య గౌడ్, పెరుక రవీందర్ ఆదివారం మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాల మేరకు వీరి అభ్యర్థిత్వాలను ఖరారు చేసినట్టు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎన్నికల బరిలో దిగే అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత స్థానిక నాయకులపైననే ఉంటుందన్నారు. ఎన్నికల వేళ చిన్న విషయాలను పెద్దిదిగా చేసుకోకుండా అందరూ సమన్వయంతో పని చేసి సర్పంచులుగా మనోళ్లను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేశ్, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, బొడిగె కొండయ్య, పెరుక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





**పోలంపల్లి సర్పంచ్ అభ్యర్థిగా మహిళా న్యాయవాది**

తిమ్మాపూర్ మండలం పోలంపల్లి సర్పంచ్ గా బొడిగె జ్ఞానేశ్వరి బరిలో దిగనున్నారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న ఆమె అభ్యర్థిత్వాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ మేరకు ఖరారు చేశారు. ప్రస్తుతం ఆమె భర్త కొండయ్య కూడా న్యాయవాదిగా కరీంనగర్ కోర్టులో పని చేస్తున్నారు. అంతే కాకుండా గతంలో ఆయన గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ గా కూడా పని చేశారు. నర్సింగపూర్ జనరల్ స్థానంలో పెరుక రవీందర్ పేరు ఖరారైంది. ఇతని సతీమణి అంజలి తిమ్మాపూర్ మండల పరిషత్ అధ్యక్షురాలు గతంలో పని చేశారు. ఈ ఇద్దరు అభ్యర్థులు మండల ప్రజలకు సుపరిచితులు కావడం గమనార్హం.

# దక్షిణాఫ్రికాతో ఉత్కంఠ పోరులో.. భారత్‌దే గెలుపు

**మొదటిపేజీ తరువాయి**

అందుకొంటూ మరోసారి వీరిద్దరూ చెలరేగిపోయారు. ఆసీస్‌పై మంచి ఫామ్ కనబరిచిన రోహిత్ (57) మళ్లీ హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే, విరాట్ కోహ్లీ (135: 120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆటే హైలైట్. సాధారణంగా కోహ్లీ వన్డేల్లో సిక్స్‌లు కొట్టడం కాస్త తక్కువే. ఎక్కువగా ఫోర్లపైనే దృష్టిపెడతాడు. ఈసారి అందుకు భిన్నంగా సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సిక్స్‌ల వర్షం కురిపించాడు. రోహిత్‌తో కలిసి సెంచరీ భాగస్వామ్యం నిర్మించిన విరాట్.. భారత్ స్కోరు 350కి చేరువగా రావడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ క్రమంలో శతకం చేసిన విరాట్ కోహ్లీ ప్రపంచ క్రికెట్‌లో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా ఘనత సాధించాడు. వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తోన్న కేఎల్ రాహుల్ (60) ఈ మ్యాచ్ ఆరంభంలో కాస్త ఇబ్బంది పడినా.. చివరికి హాఫ్ సెంచరీ సాధించాడు. ఇక ఆఖర్లో రవీంద్ర జడేజా (32: 20 బంతుల్లో) దూకుడు ప్రదర్శించాడు. అయితే, యశస్వి జైస్వాల్ (18), రుతురాజ్ గైక్వాడ్ (8), వాషింగ్టన్ సుందర్ (13) విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో యాన్సన్, బర్గర్, బార్ట్‌మన్, బాష్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

**ఆరంభంలోనే సఫారీలకు దెబ్బ..**

భారత్ నిర్దేశించిన భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు షాక్ మీద షాక్ తగిలింది. సఫారీ జట్టును హర్షిత్ రాణా దెబ్బ కొట్టాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో రికెల్టన్ (0), డికాక్ (0)ను వెనువెంటనే పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత మార్‌క్రమ్ (7) ఐదో ఓవర్లో అర్ష్‌దీప్ బౌలింగ్‌లో కీపర్ రాహుల్‌కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అప్పటికే క్రీజులో ఉన్న మాథ్యూ.. డిజార్జి(39)తో కలిసి నాలుగో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం అందించాడు. 15వ ఓవర్లో డిజార్జి.. కుల్‌దీప్ యాదవ్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన బ్రెవిస్ (37) 22వ ఓవర్లో హర్షిత్ వేసిన బంతిని సిక్స్‌గా మలిచే క్రమంలో రుతురాజ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు.

**కుల్‌దీప్ సూపర్ బౌలింగ్..**

అప్పటికి దక్షిణాఫ్రికా స్కోరు 130/5. భారత్ త్వరగానే మ్యాచ్‌ను ముగిస్తుందని అభిమానులు భావించారు. అనూహ్యంగా మాథ్యూ యాన్సన్ జోడీ ఎదురుదాడికి దిగింది. వీరిద్దరూ కలిసి 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, 34వ ఓవర్లో కుల్‌దీప్ వీరిద్దరిని పెవిలియన్‌కు పంపించి భారత్‌లో ఒక్కసారిగా ఊపుతీసుకొచ్చాడు. ఆ తర్వాత వచ్చిన సుబ్రయెన్ (17)ను కూడా కుల్‌దీప్ ఔట్ చేశాడు. చివర్లో బాష్ పోరాడినా ఫలితం దక్కలేదు. ఆఖరి ఓవర్‌లో ప్రసిద్ధ్ వేసిన బంతిని భారీషాట్‌కు యత్నించి రోహిత్ చేతికి చిక్కి బాష్ పెవిలియన్‌కు చేరాడు. దీంతో భారత్ విజయం ఖాయమైంది. టీమ్ఇండియా బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4, హర్షిత్‌రాణా 3, అర్ష్‌దీప్ 2, ప్రసిద్ధ్ ఒక వికెట్ తీశారు.

# ఎమ్మెల్యే శంకర్ చొరవ.. యజమాని ఔదార్యం..

- **పరిశ్రమ కార్మికుడి కుటుంబానికి రూ.12 లక్షల సాయం..**
- **పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందడంతో గ్రామస్తుల అభినందనలు**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్30 (జర్నలిస్ట్ డైరీ) :**

పరిశ్రమలో పనిచేసే ఓ కార్మికుడు అనారోగ్యంతో కన్నుమూశాడు. అతని కుటుంబాన్ని ఆదుకోవాలని ఆకాంక్ష మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చూపించిన చొరవ, యజమాని ఔదార్యంతో అతని కుటుంబానికి ఆర్థిక సాయం అందింది. వివరాలకు వెళితే నందిగామ మండలం వీర్లపల్లి గ్రామానికి చెందిన ఇటుక పల్లి బాలయ్య (50) గత 12 సంవత్సరాలుగా మండలంలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో ఉన్న ఆల్మో కంపెనీలో వర్కర్ గా పని చేస్తున్నాడు. అయితే కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో అతని కుటుంబ పరిస్థితి తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వేలపల్లి శంకర్ కంపెనీ యజమాని ఎండి హుస్సేన్ సేట్ తో మాట్లాడి అతని కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన యజమాని హుస్సేన్ అతని కుటుంబానికి తక్షణమే రూ. 12 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంతేకాకుండా అతని అంత్యక్రియల కోసం రూ.25 వేలు అదనంగా అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అతని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు, ఆల్మో కంపెనీ యజమాని ఎండి హుస్సేన్ సేట్ కు కృతజ్ఞతలు తెలిపారు.



# పదేండ్లు రాష్ట్రంలో ఇసుక మాఫియా చేసింది బిఆర్ఎస్ పార్టీ

- **దొంగే దొంగ దొంగ అన్నట్టుగా ఉంది బిఆర్ఎస్ నాయకుల పరిస్థితి**
- **కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజలే బిఆర్ఎస్ నాయకులను తరిమి కొడతాం**
- **ఒక పిచ్చి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాటలను నమ్మి మాజీ మంత్రి ఆగం అవుతున్నరు**
- **తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పిసిసి మెంబర్ పత్తి కృష్ణారెడ్డి**

**జర్నలిస్ట్ డైరీ, జమ్మికుంట (నవంబర్ 30):**



కొబ్బరికాయల దొంగేవడు అంటే భుజాలు తడుముకున్నట్లు బీఆర్ఎస్ నాయకుల వ్యవహార తీరు ఉందని పత్తి కృష్ణా రెడ్డి తెలిపారు. ఆదివారం రోజున తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇసుక మాఫియాను మొదలు పెట్టిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్మాణ లోపంతో కుంగిపోయిన చెక్ డ్యామ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే బాంబులతో కూల్చేశారని మాట్లాడితే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. జమ్మికుంట మండలం తనుగుల శంభుని పల్లి గ్రామం పరిధిలోని మానేరుపై బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న హయాంలోనే చెక్ డాం నిర్మాణం జరిగిందని కమిషన్లకు కక్కుర్తి పడి నాణ్యత పాటించకుండా మానేరు వాగుపై చెక్ డ్యాం నిర్మించి నేడు కాంగ్రెస్ పార్టీ వల్లనే కూలిందని దొంగ మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని రైతులకు సాగునీరు కరెంటు ఉచితంగా అందించాలనే సంకల్పంతో ఉచిత కరెంటు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని అన్నారు. కాంగ్రెస్ ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు కానీ ఆనాడు కానీ ఈనాడు కానీ ఇసుక అమ్ముకున్న దాఖలు లేవని గుర్తు చేశారు. వావిలాల జమ్మికుంట రోడ్డు ధ్వంసం కావడానికి అనేకమంది అమాయకమైన ప్రజలు చనిపోవడానికి ఇసుక మాఫియా అనే కారణమని ఆ ఇసుక మాఫియాను నడిపించింది బిఆర్ఎస్ ప్రభుత్వం అన్న సంగతి ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వారు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి బాంబులు పెట్టి పిలిచారని పేల్చారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. గతంలో మానేరు వాగు పైన కొండపాక విల్లాసాగర్ గ్రామాలలో నిర్మించిన చెక్ డ్యాములు కూలిపోయాయని గుర్తు చేశారు. ఒక పిచ్చి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాటలను నమ్మి మాజీ మంత్రులు ఆగం అవుతున్నరన్నారు. చెక్ డ్యాం నిర్మాణం లోపం వలన కూలి పోయిందని చెక్ డ్యాంలను నాసిరకంగా నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని వారు ఎంతటి వారైనా కాంగ్రెస్ పార్టీ సహించబోదని వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, మార్కెట్ వైస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి, ఇల్లందకుంట టెంపుల్ ఛైర్మన్ ఇంగిలే రామారావు, పట్టణ మహిళ అధ్యక్షురాలు పూదరి రేణుక, పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..



# ప్రజావాణి కార్యక్రమం రద్దు

- **కలెక్టర్ పమేలా సత్పతి**

**జర్నలిస్ట్ డైరీ,కరీంనగర్ (నవంబర్ 30):**

కరీంనగర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని వెల్లడించారు.

# అభివృద్దే లక్ష్యంగా కోడంగల్ లో గ్రామ సర్పంచ్ లు ఏకగ్రీవం

**జర్నలిస్ట్ డైరీ, కోడంగల్ (నవంబర్ 30) :**

వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్ పేట మండలంలో ఇప్పటివరకు 6 గ్రామాల సర్పంచ్ లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. సాలిండాపూర్ రిక్కీ బాయ్ కాంగ్రెస్ పార్టీ, మదనపల్లి తండా శంకర్ నాయక్ కాంగ్రెస్ పార్టీ, జానకంపల్లి వెంకటమ్మ కాంగ్రెస్ పార్టీ, నాగిరెడ్డిపల్లి అనిత కాంగ్రెస్ పార్టీ, కట్టు కాల్వ తాండ కిషన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ, టేకుల గడ్డ తాండ రాము నాయక్, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు ఏకగ్రీవంగా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్నాయి. దుద్యాల మండలంలో సంఘయపల్లి గ్రామ సర్పంచ్ గా వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుండి ఏకగ్రీవంగా ఎన్నిక, దౌల్తాబాద్ మండలంలో తిమ్మాయపల్లి గ్రామపంచాయతీ ఎస్సీ రిజర్వేషన్ వచ్చినందుకు గ్రామ సర్పంచ్ గా హరిజన్ శ్రవణమ్మ ను కాంగ్రెస్ పార్టీ నుండి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కోడంగల్ నియోజకవర్గం నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో ఏకగ్రీవం అయిన గ్రామాలు పెదిరిపాడుతాండ అనసూజా ఎస్టీ రిజర్వుడ్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ఏకగ్రీవం, అప్పిరెడ్డిపల్లి గ్రామం నుండి మాజీ మద్దూర్ మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బుడ్డోళ్ల శ్రీనివాస్ భార్య బుడ్డోళ్ల మల్లీశ్వరి ఇండిపెండెంట్ అభ్యర్థి సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. గ్రామ అభివృద్ధి కోసం పాఠశాల భవన నిర్మాణం కోసం 0.20 గుంటల భూమిని విరాళంగా గ్రామ పెద్దల సమక్షంలో ఇవ్వడం జరిగింది. దమలతండా సర్పంచ్ అభ్యర్థిగా అనిత నాయక్ కాంగ్రెస్ పార్టీ నుండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తపల్లి మండలంలో నందింగమా ఎస్టి రిజర్వుడ్, సర్పంచ్ అభ్యర్థి శారద కాంగ్రెస్ పార్టీ నుండి ఏకగ్రీవంగా ఎన్నిక, గుండుమాల్ మండలంలో అప్పయ్యపల్లి తండా రాజేందర్ నాయక్ కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవం, పెద్ద తండా శ్రీకృష్ణ నాయక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో అత్యధికగా అధికార పార్టీకి చెందిన నాయకులు గ్రామాలలో ఇద్దరు నామినేషన్ వేయడంతో కాంగ్రెస్ పార్టీ పెద్దలు జోక్యం చేసుకొని విత్ డ్రాలకు ఇంకా మూడు రోజులు సమయం ఉంది కావున అధికార పార్టీల అభ్యర్థులను బుజ్జగించి కొంతమంది అభ్యర్థులను విత్ డ్రా చేపిస్తే మరికొన్ని గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

# కొండగట్టు అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- **ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్**

**జర్నలిస్ట్ డైరీ,కరీంనగర్(నవంబర్30):**

జగిత్యాల జిల్లా కొండగట్టులో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నిరుపేద చిరు వ్యాపారులకు భారీగా నష్టం జరిగిన ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించాలని ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద వ్యాపారుల దుకాణాలు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన వాటిని అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని, అగ్ని ప్రమాదంలో విద్యార్థులు చదువుకున్న స్టడీ సర్టిఫికేట్ కాలిపోయినవని, చదువుకున్న విద్యార్థులకు వారికి స్టడీ సర్టిఫికెట్లును విద్యాశాఖ అధికారులతో విచారణ చేపించి తిరిగి వారికి ఓరిజనల్ సర్టిఫికెట్లు ఇప్పించాలన్నారు. తక్షణమే వారికి నివాస గృహాలు ఏర్పాటు చేయాలి, వారు కోలుకునే వరకు చిరు వ్యాపారులకు ఆహార పదార్థాలు అందించాలి. ఈ ప్రమాదానికి నిర్లక్ష్యం వహించిన స్థానిక విద్యుత్ శాఖ డిఈ, ఏఈలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రమాదాలు పునవృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. వెంటనే నిరుపేద చిరు వ్యాపారులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



# CM రేవంత్‌కు మంత్రి కోమటిరెడ్డి ధన్యవాదాలు..

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ‘తెలంగాణ రైజింగ్-2047’ పాలసీ డాక్యుమెంట్ & గ్లోబల్ సమ్మిట్‌పై జరిగిన మీడియా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి సోషల్ మీడియా వేదికగా ట్వీట్ పెట్టారు. ‘సీఎం రేవంత్ పరిచయం చేసిన తెలంగాణ రైజింగ్-2047 విజన్, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి స్పష్టమైన దిశను సూచిస్తోంది. ప్రణాళికబద్ధమైన అర్బన్ ఎకానమీ, రీజనల్ రింగ్ రోడ్లు, కొత్త ఎయిర్‌పోర్టులు, హైవే-పోర్ట్ కనెక్టివిటీ, గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించే విధానాలతో తెలంగాణను అభివృద్ధి చెందిన దేశాలు, ప్రపంచ నగరాలతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికలో తెలంగాణ చేనేతకు ప్రతీకగా నిలిచే పోచంపల్లి కళాత్మకతను ప్రత్యేకంగా ప్రదర్శించినందుకు ముఖ్యమంత్రికి హృదయపూర్వక ధన్యవాదాలు. పోచంపల్లి కళాత్మకతను అంతర్జాతీయ వేదికపై నిలబెట్టే ఈ నిర్ణయం, రాష్ట్ర సాంస్కృతిక గౌరవానికి మరో ముఖ్యమైన గుర్తింపు. తెలంగాణను “CURE-PURE-RARE” మోడల్‌తో, 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే ఈరోజు ఆవిష్కరించిన విజన్ యొక్క ప్రధాన దిశ. తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌పై మరింత బలంగా నిలబెట్టేందుకు మేమంతా కలిసి శ్రమిస్తాము. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఇది మరో కీలక ముందడుగు’’ అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పోస్టు పెట్టారు.






# భగవద్గీత బోధించే ప్రశాంత జీవన రహస్యం గీతా జయంతి ప్రత్యేకం

**(జర్నలిస్ట్ డైరీ, ఆధ్యాత్మిక చింతన)**

భగవద్గీత, యుద్ధభూమిలో శ్రీకృష్ణ భగవానునికి, అర్జునునికి మధ్య జరిగిన సంభాషణ. అయితే, దాని అసలైన సందేశం కేవలం యుద్ధం గురించే కాదు, ప్రతిరోజూ వివేకవంతంగా ఎలా జీవించాలో తెలియజేయడం. దాని అత్యంత ప్రధానమైన బోధన నిష్కామ కర్మ గురించి ఉంది. ఫలితాలపై ధ్యాస ఉంచకుండా, మీ శక్తిమేరకు కృషి చేయడం. గొప్ప భారతీయ ఆధ్యాత్మిక గురువైన పరమహంస యోగానంద, కోరికలు లేకుండా కర్మలను నిర్వర్తించడం యోగంలో ఒక ముఖ్యమైన అంశమని చెప్పారు. గాడ్ టాక్స్ విత్ అర్జున: ది భగవద్గీత (God Talks With Arjuna: The Bhagavad Gita) అనే తన మహత్తర గీతాభాష్యంలో, శ్రీకృష్ణుని సందేశం ఒక అర్థంకాని తత్వశాస్త్రం కాదని, గృహస్థునకైనా, ఒక సంస్థకు అధిపతికైనా, లేక ఒక దైవాన్వేషకునికైనా ఇది ఒక ఆచరణాత్మకమైన మార్గదర్శి అని ఆయన వివరించారు.

భగవద్గీతలోని 2వ అధ్యాయం, 47వ శ్లోకంలో, శ్రీకృష్ణుడు అర్జునుడికి ఇలా బోధించారు: "కర్మలు చేయుటయందు మాత్రమే నీకు అధికారము కలదు, వాటి ఫలితములందు ఎన్నడూ లేదు. నీ కర్మఫలములకు సృష్టికర్తవు నీవని భావించకు; అట్లని నిష్క్రియ పట్ల నీకు అనురక్తి కలగనీయకు."

దీని అర్థం ఏమిటంటే: అది మీ ఉద్యోగమైనా, మీ కుటుంబాన్ని పోషించడం అయినా, లేదా ఏదైనా బాధ్యత అయినా, మీ కర్తవ్యాన్ని నిర్వర్తించండి. కానీ ప్రతిఫలం గురించి, గుర్తింపు గురించి నిరంతరం ఆందోళన చెందుతూ ఉండకండి. "నాకేమి లభిస్తుంది" అనే ఆందోళన ఒత్తిడిని మాత్రమే తెస్తుంది. మీరు ఫలితంపై కాకుండా, కర్మపైనే దృష్టి సారించినప్పుడు స్వేచ్ఛ లభిస్తుంది. అదే సమయంలో, సోమరిగా లేదా నిష్క్రియగా మారకండి. 48వ శ్లోకంలో, శ్రీకృష్ణుడు అర్జునుడికి ఇలా సలహా ఇచ్చారు:

"ఓ ధనంజయ, యోగంలో నిమగ్నుడవై, సమస్త కర్మలను ఆచరించుము. వాటి ఫలాలపై ఆసక్తిని త్యజించి, జయాపజయములయందు సమభావము గలవాడవై ఉండుము. ఈ మానసిక సమత్వమే యోగం అని చెప్పబడుతుంది."

జీవితం ప్రశంసలను, నిందలను, విజయాన్ని, అపజయాన్ని తెస్తుంది. ఈ రెండు పరిస్థితుల లోనూ ప్రశాంతంగా ఉండాలని శ్రీకృష్ణుడు మనకు బోధిస్తారు. ఈ సమభావమే నిజమైన యోగం—ఆంతరంగిక శాంతిని బాహ్య కర్మాచరణతో అనుసంధానం చేయడం.

3వ అధ్యాయం, 30వ శ్లోకంలో, ఈ స్థితిని సాధించడానికి శ్రీకృష్ణుడు కీలకమైన మార్గాన్ని తెలియజేశారు:

"సమస్త కర్మలను నాకు అర్పించుము! అహంకారం, ఆశలు విడచి, నీ మనస్సును ఆత్మపై కేంద్రీకరించి, ఆందోళన నుండి విముక్తుడవై, కర్మాచరణమనే యుద్ధంలో నిమగ్నమై ఉండుము."

సరళమైన మాటల్లో చెప్పాలంటే, మీరు చేసే ప్రతి పనిని భగవంతునికి అంకితం చేయండి. ఈ విధంగా జీవించడం అంటే ప్రపంచం నుంచి విరమించుకోవడం కాదు, అశాంతి కారకమైన కోరికలు లేకుండా, అహంకారం లేకుండా, అపేక్ష, తీవ్రమైన చింత లేకుండా, ప్రతి కర్మను ఆయనకు ఒక సమర్పణగా నిర్వర్తించడం. ప్రశాంతమైన జీవితానికి ఇదే ఏకైక మార్గం. 5వ అధ్యాయం, 10వ శ్లోకంలో, శ్రీకృష్ణుడు ఒక అందమైన ఉపమానాన్ని అందించారు:

"నీటిచే అంటబడని తామరాకు వలె, కర్మలను నిర్వర్తించే యోగి, ఆసక్తిని త్యజించి, తన కర్మలను అనంతునికి (భగవంతునికి) సమర్పించడం ద్వారా, ఇంద్రియ బంధాలకు లోనుకాకుండా ఉంటాడు."

బురదలో పెరిగినా దాని మలినం సోకని కమలం వలె, నిష్కామ కర్మను ఆచరిస్తూ, భగవంతునికి శరణాగతి చెందడం ద్వారా ప్రాపంచిక పోరాటాల మధ్య జీవిస్తూ కూడా ప్రశాంతంగా ఉండవచ్చు.

ఈ సనాతనమైన బోధనల వ్యాప్తికి యోగానంద పశ్చిమ దేశాలలో సెల్ఫ్‌రియలైజేషన్ ఫెలోషిప్ (SRF)ను, మరియు యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (వై.ఎస్.ఎస్.) ను భారతదేశంలోను స్థాపించారు. ఆయన విశిష్ట గ్రంథం, ఒక యోగి ఆత్మకథ (autobiography of a yogi), లక్షలాది మందికి యోగమును, ధ్యానాన్ని— ముఖ్యంగా భగవద్గీతలో కూడా ప్రస్తావించబడిన క్రియాయోగమనే సనాతన ప్రక్రియను,— దైవానుభవం కలిగించే ఒక తిన్నని రాజమార్గంగా పరిచయం చేసింది.

నిష్కామ కర్మ అంటే బాధ్యతల నుంచి పలాయనం కాదు, అది హృదయపూర్వకంగా— కార్యాలయాలలోను, మానవ సంబంధాలలోను, వ్యక్తిగత లక్ష్యాలలోను — పనిచేయడం, కానీ ఫలితాల కోసం ప్రాకులాడకుండా ఉండటం. యుద్ధభూమి ప్రతీకాత్మకమే కావచ్చు, కానీ పోరాటం నిజమైనది—వ్యామోహానికీ స్వేచ్ఛకూ మధ్య, అహంకారానికీ శరణాగతికీ మధ్య, నిష్కామ కర్మలోనే విజయం ఉందని గీత మనకు చూపిస్తుంది. ఎందుకంటే అది మాత్రమే శాశ్వత ఆనందాన్ని ఇవ్వగలదు.



# పాకిస్తాన్‌కు వార్నింగ్.. "ఆపరేషన్ సిందూర్"పై నేవీ చీఫ్ కీలక వ్యాఖ్యలు..

- **ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది..**
- **పాకిస్తాన్‌కు నేవీ చీఫ్ వార్నింగ్..**

పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్తాన్‌పై భారత్ "ఆపరేషన్ సిందూర్" పేరుతో భీకర దాడులు చేసింది. పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలతో పాటు ఆ దేశ ఎయిర్ ఫోర్స్ బేసుల్ని ధ్వంసం చేసింది. ఇదిలా ఉంటే, దయాది దేశం మళ్లీ తోక జాడిస్తే మళ్లీ దాడులు చేస్తామని ఇప్పటికే కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు పలువురు సైన్యాధికారులు వార్నింగ్ ఇచ్చారు. తాజాగా, భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి ఆదివారం పాక్‌కి హెచ్చరికలు జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇప్పటికీ కొనసాగుతోందని అన్నారు. మహారాష్ట్ర పూణేలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ కు అంకితం చేసిన ఇండియన్ నేవీ మారిటైమ్ మ్యూజియం శంకుస్థాపనలో ఆయన వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నేవీ వేగంగా మోహరించిందని, దీంతో పాకిస్తాన్ నేవీ కేవలం హార్బర్‌కు మాత్రమే పరిమితమైందని చెప్పారు. ప్రపంచ సముద్రాలు కఠినంగా ఉన్నప్పుడు ప్రపంచం స్థిరమైన లైట్ హౌజ్ కోసం చూస్తుందని, బాధ్యతాయుతమైన భారతదేశం ప్రపంచ వేదికపై ఆ పాత్ర పోషించగలదని ఆయన పేర్కొన్నారు. పహల్గామ్ దాడి తర్వాత కేవలం 96 గంటల్లోనే నేవీని మోహరించామని,దీంతో పాకిస్తాన్ ఒత్తిడికి గురైందని చెప్పారు.

# 'జ్ఞానం' ఉచితంగా పొందాలి: భారతదేశంలో పరిశోధనా పత్రాల ప్రాప్యతకు సవాలు'

భారతదేశంలో విద్యా పరిశోధనా రంగానికి సంబంధించిన 2025 సంవత్సరం రెండు ముఖ్యమైన సంఘటనలను చవిచూసింది. జనవరిలో ప్రారంభమైన 'వన్ నేషన్ వన్ సబ్స్క్రిప్షన్' (ఓఎన్ ఓఎస్) పథకం, ఆగస్టులో డెల్హీ హైకోర్టు సైహబ్ అలాగే ఇతర శాడో లైబ్రరీ వెబ్సైట్లపై నిషేధం విధించడాన్ని చూస్తే. ఈ రెండూ ఒకదానికొకటి పరస్పర విరుద్ధమైన దిశలను సూచిస్తున్నాయి. ఈ సంఘటనలు జ్ఞానం యొక్క ప్రాప్యత(యాక్సెస్), దానికి అయ్యే ఖర్చు ...అలాగే, భారతీయ విద్యార్థులు, పరిశోధకుల భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతాయో గమనించాల్సిన అవసరం ఉంది.



**జనవరి 2025లో ప్రారంభించబడిన**

(ఓఎన్ ఓఎస్)పథకం ఒక మంచి అడుగు. ప్రభుత్వం ఈ పథకం ద్వారా దేశంలోని విద్యా సంస్థలకు అకడమిక్ జర్నల్స్ అ రీసెర్చ్ డేటాబేస్లకు సులభ ప్రవేశాన్ని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, డాష్ బోర్డ్ గణాంకాలు ఈ లక్ష్యం ఎంత మటుకు సాధించబడిందో చూపిస్తున్నాయి. (ఓఎన్ ఓఎస్) లో నమోదు చేసుకున్న సంస్థలు కేవలం 7,318 మాత్రమే. దీనిలో 98 లక్షల మంది వినియోగదారులు మరియు 1,81,795 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఇది భారతదేశం యొక్క విస్తృత విద్యా వ్యవస్థను అందించాల్సినంత పరిధిలో లేదు. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ 202122 (ఐఏఎస్ హెచ్ ఈ ) రిపోర్ట్ ప్రకారం, దేశంలో 1,168 యూనివర్శిటీలు, 45,473 కళాశాలలు, 12,002 స్వతంత్ర విద్యా సంస్థలు, 4.33 కోట్ల మంది విద్యార్థులు మరియు 15.98 లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఐఐటీలు (ఐఐటీలు), సెంట్రల్ యూనివర్శిటీలు వంటి పెద్ద సంస్థలు ఖరీదైన జర్నల్లకు సొంతంగా చందాలు చెల్లించగలిగినా, ఇవి మన విద్యా వ్యవస్థలో చిన్న భాగం మాత్రమే. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, చిన్న కళాశాలలు, స్వతంత్ర పరిశోధకులు ఈ (ఓఎన్ ఓఎస్) పథకం నుండి బహిష్కరించబడినట్లే. అందుకే (ఓఎన్ ఓఎస్) ప్రస్తుతం ఒక అసంపూర్ణమైన, అసమానత్వంతో కూడిన ప్రయత్నంగానే కనిపిస్తోంది.

ఈ పరిస్థితిలోనే, ఆగస్టు 2025లో డిల్లీ హైకోర్టు (సైహబ్ ) మరియు ఇతర షాడో లైబ్రరీల పై నిషేధాన్ని విధించింది. ఈ వెబ్సైట్లు ఎల్స్వియర్ , వైలీ వంటి ప్రచార సంస్థలు డిల్లీ హైకోర్టు లో దావా దాఖలు చేయడంతో నిషేధించబడ్డాయి. ఈ ప్రచార సంస్థలు లాభాపేక్షగా పనిచేసే ట్రాన్స్నేషనల్ అకడమిక్ పబ్లిషర్లు కోర్టు తన తీర్పులో (యూటీవీ) సాఫ్ట్వేర్ కమ్యూనికేషన్ వర్సెస్ 1337x కేసును రిఫరెన్స్‌గా తీసుకుంది. ఈ కేసు సినిమాలు, ఎంటర్టైన్మెంట్ కంటెంట్స్ పై దాఖలు చేయబడింది. కానీ కోర్టు ఆ కేసును శాస్త్రీయ జ్ఞానం, పరిశోధనా పత్రాలకు కూడా వర్తింప జేసింది. సినిమా సంగీతాలకు, పరిశోధనా ఉపన్యాసాలకు ఒకే నియమాలు వర్తించవు. ఇది యాపిల్ లను మరియు నారింజ పండ్లను ఒకే రకంగా పరిగణించినట్లు గానే భావించవలసి వస్తుంది . ఈ తీర్పు కాపీరైట్ చట్టాల మధ్య ఈ క్లిష్టమైన సమస్యను మరచిపోయింది.

పరిశోధన మరియు విద్య రెండూ ఒకదానికొకటి అనుబంధంగా ఉంటాయి. ప్రయోగశాలలు, తరగతి గదులతో పాటు లైబ్రరీలు - డిజిటల్ లేదా ముద్రిత రూపంలో ఉన్నా - ప్రస్తుత జ్ఞానాన్ని అర్థం చేసుకోవడానికి, కొత్త జ్ఞానాన్ని సృష్టించడానికి అత్యవసరం. ఈ లైబ్రరీలలో అత్యంత ముఖ్యమైన భాగం శాస్త్రీయ అధ్యయనాలు మరియు అకడమిక్ జర్నల్లకు ఫ్రీ యాక్సెస్ లభించచాలి. కానీ ఈ జ్ఞాన వనరులు ఇప్పుడు చాలా పరిమితమైపోయాయి. అవి ఇప్పుడు అత్యధిక ధరలకు అమ్ముడు పోతున్నాయి. ఇది కేవలం భారతదేశంలోని సమస్య మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఈ పబ్లిషింగ్ సంస్థలు, కొన్ని ప్రచార సంస్థలు కలిసి ఒక ఏక స్వామ్య గుత్తాధిపత్యాన్ని ఏర్పరచుకున్నాయి. ఈ ప్రచార సంస్థలు రెండు రకాల లాభాలు పొందుతున్నాయి. ముందుగా, పరిశోధకులు తమ పరిశోధనా ఫలితాలను ప్రచురించడానికి వేల డాలర్ల 'ఆర్టికల్ ప్రాసెసింగ్ ఛార్జీలు' (ఆర్టికల్ ప్రాసెసింగ్ ఫీజులు) చెల్లించాలి. 2023లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం, 2015 2018 మధ్యకాలంలో ప్రపంచ పరిశోధక సమాజం ఓపెన్‌ఆక్సెస్

ప్రచురణ ఫీజులపై 1 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసింది. రెండవది, ఈ జర్నల్లలోని వ్యక్తిగత పరిశోధనా వ్యాసాలు కూడా అత్యధిక ధరలకు విక్రయించబడతాయి. ఇందులో వింత ఏమిటంటే, ఆ వ్యాసాన్ని రాసిన రచయిత కూడా తన స్వంత పరిశోధనా వ్యాసాన్ని చదవడానికి చెల్లించలేని స్థితి ఉంటుంది. పరిశోధకుడు తన బుద్ధి పరిశ్రమతో సృష్టించిన జ్ఞానాన్ని ప్రచురించడానికి డబ్బు చెల్లించాలి, ఆ తర్వాత ఆ జ్ఞానం నుండి వచ్చిన లాభం అతనికి లభించదు. ఇది ఒక రకమైన నైతిక, ఆర్థిక సమస్య కూడా.

జ్ఞానాన్ని ఒక లాభదాయక వస్తువుగా మార్చిన ఈ పరిస్థితిలో, శాడో లైబ్రరీలు ఒక ప్రత్యామ్నాయ మార్గంగా ఉద్భవించాయి. సైహబ్, లైబ్ జెన్ (LibGen) వంటి వేదికలు ప్రచార సంస్థలు ఏర్పరచిన 'పేవాల్స్' (Paywalls చెల్లింపు అవరోధాలు) ను దాటి, పరిశోధనా వ్యాసాలు, కాన్ఫరెన్స్ నివేదికలు, పుస్తకాల అధ్యాయాలు ఉచితంగా అందిస్తాయి. జ్ఞానాన్ని పంచుకోవడం వలన దాని సరఫరా తగ్గిపోదు. ఒకరు ఇచ్చినా, మరొకరు తీసుకున్నా, అసలు వ్యక్తి దాన్ని కోల్పోడు. విద్య ఒక హక్కు అయితే, దానికి అనువైన మార్గాలు కూడా ఉండాలి. షాడో లైబ్రరీలు ఈ హక్కును నెరవేర్చడానికి ప్రయత్నిస్తున్నాయి. కానీ, హైకోర్టు తీర్పు వీటిని నేరస్థులుగా గుర్తించి, పరిశోధకులకు అవసరమైన విద్యా సామగ్రిని పొందడానికి ఉపయోగించే మార్గాన్ని మూసేసింది.

కోర్టు నిషేధం మరియు ఒన్ నేషన్ ఒన్ సబ్స్క్రిప్షన్ యొక్క అసమర్థత వల్ల ఇప్పుడు మన దృష్టి ఏమిటో తెలుసుకోవాలి. షాడో లైబ్రరీలపై దాడి చేయడమా, లేదా జ్ఞానానికి సమానమైన, సమగ్రమైన, సరసమైన ప్రాప్యతను (యాక్సెస్) ను కల్పించడమా? స్పష్టంగా, రెండోదే సరైన మార్గం. దీని కోసం మన ప్రయత్నాలు, అలాగే వనరులను క్రింది రంగాలలో కేంద్రీకరించాలి. లైబ్రరీ వనరుల కోసం ఆర్థిక మద్దతు పొందాలి: విశ్వవిద్యాలయాలు, కళాశాలల లైబ్రరీలకు ప్రత్యేకంగా, జర్నల్ చందాలు, డేటాబేస్ల కొరకు సరిపడా నిధులు కేటాయించాలి. ఒన్ నేషన్ ఒన్ సబ్స్క్రిప్షన్ పరిధిని విస్తరించడం

ప్రస్తుతం (ఓఎన్ఓఎస్) పథకం దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, స్వతంత్ర పరిశోధకులను కవర్ చేయేలా విస్తరించబడాలి. ఓపెన్ ఆక్సెస్ ప్రచురణలను ప్రోత్సహించడం, ప్రభుత్వం మరియు నిధి దాత సంస్థలు ఓపెన్‌ఆక్సెస్ జర్నల్లలో ప్రచురణకు మద్దతు ఇవ్వాలి. ఇలా ప్రచురించబడిన పరిశోధనలు అందరికీ ఉచితంగా లభ్యమవుతాయి. నైతిక వేదికలకు మద్దతు ఇవ్వాలి. శాస్త్రీయ జ్ఞానాన్ని చట్టబద్ధంగా, నైతికంగా పంచుకునే ప్లాట్ఫారమ్లను రూపొందించడానికి మద్దతు ఇవ్వాలి.

చివరకు, మన దృష్టి శాడో సైట్లపై శిక్షాత్మక చర్యల నుండి తప్పించి, సమతుల్యమైన మరియు వీలైనంత ఖర్చుతో కొత్త, అత్యాధునిక పరిశోధనలను అందరూ ప్రవేశించగలిగే వ్యవస్థను నిర్మించడంపై కేంద్రీకరించాలి. జ్ఞానం అనేది కేవలం వ్యాపారం కాదు, ఒక సామాజిక వనరు. దాని మీద ఎవరికీ ఏక స్వామ్య గుత్తాధిపత్యాన్ని కలిగి ఉండకూడదు. ప్రతి ఒక్కరూ దాన్ని స్వేచ్ఛగా పొందగలగాలి, పంచుకోగలగాలి మరియు దానికి సహాయపడగలగాలి. అప్పుడే భారతదేశం ఒక జ్ఞాన ఆధారిత అర్థ వ్యవస్థగా, సమాజంగా ముందుకు సాగగలదు.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.



# డా. చింతల రాకేశ్ భవానికి శ్రీ భగవాన్ సత్య సాయిబాబా సేవా పురస్కారం

**జర్నలిస్ట్ డైరీ, ఇబ్రహీంపట్నం(నవంబర్ 30):**

శ్రీ పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని 2025 సంవత్సరానికి సాహిత్య, సామాజిక సేవా పథక విభాగాల్లో చేసిన కృషిగానుగాను " శ్రీ సత్యసాయి సేవా పురస్కారం " ను కవి, రచయిత, గాయకులు, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ చింతల రాకేశ్ భవానికి అందజేశారు. మురళీమోహన్ రాజు, డాక్టర్ రాధా కుసుమ, కె.వి కృష్ణకుమారి, మాగంటి ప్రసాద్ బాబు, రామచంద్ర తదితులు పురస్కార గ్రహీతను ఘనంగా సన్మానించారు. కుసుమ ధర్మన్న కళా పీఠం, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్లు సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందజేశాయి. ఈ కార్యక్రమం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా. చింతల రాకేశ్ భవాని మాట్లాడుతూ ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసిన సెలెక్షన్ కమిటీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. రాకేష్ భవాని ప్రతిష్టాత్మక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ



ఉత్తమ అధ్యాపక పురస్కారం 2024 ను అందుకున్నారు. తెలుగు భాషా సాహిత్యాలకు సంబంధించి వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని అనేక పత్ర సమర్పణలు చేశారు."తెలుగు సినీ గేయ సాహిత్యం సమకాలీన సమాజ చిత్రణ (196070)" అన్న అంశంపై ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి 2020లో డాక్టరేట్ ను పొందడం జరిగింది. ప్రతిష్టాత్మక "తానా" వారి ఆధ్వర్యంలో 21 దేశాలు పాల్గొన్న " ప్రపంచ మహా కవిసమ్మేళనం 21"లో భారతదేశం ప్రతినిధిగా నుంచి నైజీరియా తెలుగు సంఘం తరపున పాల్గొని ప్రశంసలు పొందారు. తెలుగు భాషా చైతన్య సమితి మరియు తెలంగాణ రచయితల సంఘం లచే 2022 కాళోజీ విశిష్ట పురస్కారం ను , జాతీయస్థాయిలో ఉత్తమ జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారులకు అందజేసే ప్రతిష్టాత్మకమైన " క్రిశా ఫౌండేషన్ "ముంబాయి వారి 2022 "కరంవీర" పురస్కారం అందుకున్నారు.డా.బీ.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ఇచ్చే "దళితరత్న2021" పురస్కారాన్ని సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ యోగితారానా, గోరేటి వెంకన్న చేతుల మీదుగా స్వీకరించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ సంస్థ తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మాత్యులు సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి" చేతుల మీదుగా విద్యా సేవారత్న 2021" పురస్కారం పొందారు. అంతర్జాతీయ సంస్థ అయిన హోలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎంపవర్మెంట్ పురస్కారం 2022సంవత్సరానికి విద్యారంగంలో చేసిన కృషికి గాను అందుకున్నారు. జాతీయ సేవాపథక రంగారెడ్డి జిల్లా ప్రోగ్రాం అధికారిగా ,కేంద్ర ప్రభుత్వం వారిచే కోవిడ్ సమయంలో జిల్లా నోడల్ అధికారిగా నియమించబడి కోవిడ్ వారియర్ గా పనిచేసి అధికారుల ప్రశంసలు పొందారు. రంగారెడ్డి జిల్లా నెహ్రూయువ కేంద్ర కమిటీలో సలహా సభ్యునిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాకేశ్ భవానిని కళాశాల ప్రిన్సిపల్ డా.రాధిక, వైస్ ప్రిన్సిపల్ డా.సురేశ్ ,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# రానున్న కాలం బీసీ రాజ్యమే..!

- **జాతీయ బిసి జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప**
- **ఉద్యమ ఉజ్వల పుస్తక ఆవిష్కరణ**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 30 (జర్నలిస్ట్ డైరీ) :**

రానున్న కాలం బీసీ రాజ్యమేనని జాతీయ బిసి జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప వెల్లడించారు. షాద్ నగర్ పట్టణంలో శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు ఆయనకు సంబంధించిన ఉద్యమ ఉజ్వల పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ జనసేన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు సలహాలు తీసుకున్నారు. జాతీయ బీసీ జనసేన అధ్యక్షులు చంద్రశేఖర అప్ప ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. బీసీ మేధావులు బలమైన ఉద్యమం చేపడితే పాలకులు దిగివచ్చి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. బీసీలకు భిక్షం వద్దు, రాజ్యంగబద్ధంగా రావాల్సిన హక్కులను కల్పించాలన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ నినాదం అత్యంత బలంగా ఉందని, అందుకు రాజ్యాంగాన్ని సవరించి, ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద కులాలకు గౌరవం అధికారం ద్వారానే సాధ్యమౌతుందని పేర్కొన్నారు. బీసీ జనసేన ద్వారా నియోజకవర్గంలో పాటు అనేక ప్రాంతాల్లో విస్తరించి ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని ఆర్ కృష్ణయ్య సూచనల సలహాల మేరకు బీసీ జనసేన అనేక రాజలేని పోరాటాలు చేసేందుకు ముందుకు సాగుతామని అన్నారు. ఈ సందర్భంగా పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బీసీ జనసేన నాయకులు జక్కుల జలజ భాగ్యలక్ష్మి గౌడ్, స్రవంతి రాజ్ అరుణ్ గౌడ్, రాములు, జమాల్పూర్ చందూలాల్ తంగేడి పల్లి శంకర్ జూపల్లి చంద్రశేఖర్ మల్కాపూర్ రవి పాండు తదితరులు పాల్గొన్నారు.







# రాష్ట్రం 3 విభాగాలుగా వర్గీకరణ..

- **స్ట్రాటజీలో భాగంగా తెలంగాణను మూడు విభాగాలుగా తీసుకున్నాం**
- **కాలుష్య రహిత నగరంగా మార్చాలంటే దీన్ని క్యూర్ చేయాల్సిందే**
- **ఔటర్ లోపల నాలుగు విభాగాలు ఉండేవి, దాంతో గందరగోళం ఏర్పడింది**
- **అందుకే ఈ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించాం**
- **కోర్ అర్బన్ రీజియన్‌ను ఒక విభాగంగా తీసుకున్నాం. -సీఎం రేవంత్ రెడ్డి**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**



తెలంగాణ భవిష్యత్తు కోసం రూపొందిస్తున్న 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు , ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తమ ప్రభుత్వం ప్రజా పాలనలో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ పాలసీ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రజలకు అంకితం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ డాక్యుమెంట్‌కు 'రైజింగ్ 2047'గా నామకరణం చేశామని ఆయన చెప్పారు. ఈ ప్రణాళికలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

గతాన్ని అనుభవంగా తీసుకుని, ఆ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూనే భవిష్యత్‌కు అడుగులు వేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాలసీలలో పెరాల్సిస్ వస్తే రాష్ట్ర భవిష్యత్ తీవ్రంగా నష్టపోతుందని ఆయన హెచ్చరించారు. ఈ పాలసీ డాక్యుమెంట్ తయారీలో భాగంగా, తాము ఐఎస్‌బీ (ISB), నీతి ఆయోగ్ వంటి ప్రముఖ సంస్థల సలహాలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. విజన్‌లో భాగమే స్ట్రాటజీ అని, ఆ స్ట్రాటజీలో భాగంగానే తెలంగాణను మూడు ప్రధాన ఆర్థిక విభాగాలుగా వర్గీకరించామని సీఎం వివరించారు. ముఖ్యమంత్రి తెలంగాణ ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్రంలోని ప్రాంతాలను మూడు విభాగాలుగా విభజించారు:

CURE (Core Urban Region Economy): ఔటర్ రింగ్ రోడ్డు (ORR) లోపలి ప్రాంతం అంతా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా పరిగణించబడుతుందని సీఎం తెలిపారు. గతంలో ఔటర్ లోపలి ప్రాంతంలో ఉన్న నాలుగు విభాగాల గందరగోళం తొలగిపోతుందని, కాలుష్య రహిత నగరంగా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని 'క్యూర్' చేయాల్సిందేనని వివరించారు.

PURE (PeriUrban Region Economy): ఔటర్ రింగ్ రోడ్డు బయటి నుండి ఆర్‌ఆర్‌ఆర్ (Regional Ring Road) వరకు ఉన్న ప్రాంతాన్ని పెరిఅర్బన్ రీజియన్ ఎకానమీగా గుర్తించారు. 360 కి.మీ. పొడవైన ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్రం అంగీకారం తెలిపిందని, ఇది నగరానికి రెండో అర్బన్ రీజియన్‌గా మారుతుందని అన్నారు. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేలతో పాటు, బుల్లెట్ ట్రైన్ వేయడానికి కేంద్రం నుండి అనుమతి తెచ్చామని, హైదరాబాద్‌బెంగుళూరు మధ్య కనెక్టివిటీని పెంచి అభివృద్ధిని సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

RARE (Rural Agricultural Region Economy): ఆర్‌ఆర్‌ఆర్ బయటి నుండి తెలంగాణ సరిహద్దు వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీగా గుర్తించారు.

**ఆదాయం-సంక్షేమం, విద్యా వ్యవస్థ ప్రక్షాళన:**

"ఆదాయం పెంచాలి... పేదలకు పంచాలి" అనేది తమ ప్రభుత్వ విధానమని సీఎం స్పష్టం చేశారు. మనకు ఫుడ్ సమస్య లేకపోయినా, పోషకాహార (న్యూట్రీషియన్) సమస్య ఉందని, దాన్ని ఎలా పరిష్కారం చేయాలనే దానిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ గ్రామాలకు చేరినప్పటికీ, ఇప్పుడు నాణ్యమైన విద్య, సాంకేతిక విద్య అందించడంపై దృష్టి పెట్టామని, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణను 'నాలెడ్జ్ హబ్'గా మారిస్తే, పెట్టుబడులు, కంపెనీలు క్యూ కడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతేకాకుండా, ఎయిర్‌పోర్టుల విస్తరణలో భాగంగా వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో కొత్త ఎయిర్‌పోర్టులు తెస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.





# విజయవంతంగా ముగిసిన ఎలిమినేడు ప్రీమియర్ లీగ్ సీజన్–8

- **బహుమతులు ప్రదానం చేసిన బీఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్**

**జర్నలిస్ట్ డైరీ, ఇబ్రహీంపట్నం(నవంబర్ 30):**

ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్ రెడ్డి కుమారుడు దివంగత మంచిరెడ్డి విక్రమ్ రెడ్డి జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఎలిమినేడు ప్రీమియర్ లీగ్ (EPL) సీజన్-8 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేయడానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) క్రీడాకారులను అభినందిస్తూ గ్రామ స్థాయి క్రీడలను ప్రోత్సహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్, మాజీ ఉప సర్పంచ్ మేడ్చల్ రాంరెడ్డి, నాయకులు రామ్ రెడ్డి, బుట్టి నరసింహ, బుట్టి మహేష్ చంటి, గడ్డం శేఖర్ గౌడ్, దొండ శివా రెడ్డి, ఆర్గనైజర్లు సతీష్, స్వామి, గిరి, జీ. శివ, వెంకటేష్, చారి, గ్రామ క్రీడాకారులు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రవల్లిక శివ(ఎస్పీ) దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద (బిక్ష) కార్యక్రమం

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 30 (జర్నలిస్ట్ డైరీ) :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో అయ్యప్ప స్వాములకు తొమ్మిదివ రోజు ప్రవల్లిక శివ దంపతులు ఆధ్వర్యంలో బిక్ష కార్యక్రమం నిర్వహించారు. అన్న ప్రసాద ధాత ప్రవల్లిక శివ వారి ఇతర కుటుంబ సభ్యులతో పాటు అగ్గనూర్ విశ్వం, సిటి కేబుల్ ముత్యాల్, ఆయిల్ ప్రవీణ్, సుజ్జీవన్ స్వామి,పౌల్ట్రీ సతీష్ స్వామి,భాను శర్మలు వారితో కలిసి అయ్యప్ప స్వామికి పూజా కార్యక్రమం ముగించుకొని స్వాములకు బిక్ష ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వన్నాడా ప్రకాష్ గౌడ్, గునెల్లి రమేష్ స్వామి,కొత్ర రాజు, పినపాక ప్రభాకర్, శ్రీశైలం గౌడ్, సికేర రమేష్ స్వామి, బాల్ రెడ్డి స్వామి, మాచారం రవీంధర్ గౌడ్, పోలె రాజేశ్వర్ స్వామి,ప్యాటా విశ్వేష్ స్వామి, అభిలాష్ గౌడ్ స్వామి, గుడ్డు స్వామి,వినోద్ స్వామి, కెకె స్వామి, హరి స్వామి, పూల శ్రీను స్వామి, హరి బాబు స్వామి, అక్షిత్ స్వామి, సింగపాగ లక్ష్మయ్య, అరుణ్ కుమార్ స్వామి, సాయి కుమార్ స్వామి, అనిల్ కుమార్ స్వామి, శరత్ స్వామి, నాగరాజు స్వామి పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల వేళ

# బీఆర్ఎస్ లో చేరికలు

- **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న చేగూర్ కాంగ్రెస్ నేతలు**
- **కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని తెలిపిన అంజయ్య యాదవ్**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్,30 (జర్నలిస్ట్ డైరీ) :**

నందిగామ మండలం చేగూర్ గ్రామానికి కాంగ్రెస్ నాయకుడు బంటారం మల్లేష్ గౌడ్ తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. షాద్ నగర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నేతలకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం అంజయ్య యాదవ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ నాయకత్వాన్ని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గడిచిన రెండు సంవత్సరాలలో ఎలాంటి అభివృద్ధి చేసిందో ప్రజలు గమనిస్తున్నారని, కేసీఆర్ లేని లోటు మన కళ్ళ ముందు కనిపిస్తుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు గులాబీ పార్టీ మద్దతుదారులు భారీ మెజార్టీతో గెలుపొంది గ్రామపంచాయతీల పీటలపై కూర్చుంటారని స్పష్టం చేశారు. గులాబీ పార్టీలో చేరిన వారిలో మంగళి చంద్రమౌళి, మరికల్ నరేష్ గౌడ్, సోలిపేట వేణు, మలపురం సుమన్, శ్రీకాంత్ గౌడ్, బంటారం వెంకటేష్ గౌడ్, కారటి శ్రీను యాదవ్, సోలిపేట అభి,మరికల్ దినేష్, పబ్బె జంగయ్య, రేనట్ల కార్తీక్ గౌడ్, దతగల యాదగిరి, బండ్ల రమేశ్, బోల్గాం ప్రవీణ్, గోష్టి శివ, వెంకట్ స్వామి తదితరులు ఉన్నారు. మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మండల అధ్యక్షులు పద్మా రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, మాజీ సర్పంచులు శ్రవణ్ పట్వారీ, జెట్ట కుమార్, రాజు పాల్గొన్నారు.



## పార్లమెంట్ లో తెలంగాణ సమస్యలను ప్రస్తావిస్తాం

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

నేటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వింటర్ సెషన్ లో తెలంగాణ రాష్ట్ర సమస్యలు, దేశ వ్యాప్తంగా నెలకొన్న ప్రజా సమస్యలపైన పార్లమెంట్ లో బలంగా గొంతు వినిపిస్తామని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రధానంగా తెలంగాణకు సంబంధించిన అంశాలైన రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, మూసీ రీజువెనేషన్, పట్టణ స్థానిక సంస్థలకు అర్బన్ చాలెంజ్ ఫండ్, కొత్త రైల్వే మార్గాల ఆమోదాలు, వరంగల్, కొతగూడెం, పెదపల్లి విమానాశ్రయ అనుమతులపైన పార్లమెంట్ మాట్లాడుతామన్నారు. అలాగే రాష్ట్రానికి అవసరమైన ఆర్థిక అనుమతులను కూడా డిమాండ్ చేస్తామని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఈ అంశాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రజలకు కీలకమైన అంశాలు కూడా లేవనెత్తుతామని వాటిల్లో ఈసీ చేపడుతున్న ఓటర్ లిస్ట్ ల ఎస్ఐఆర్ లో లోపాలు, రాజకీయ జోక్యం, పెరుగుతున్న నిరుద్యోగం, ఢిల్లీ-ఎన్సీఆర్ విపరీత కాలుష్యం, ఇటీవల ఢిల్లీలో జరిగిన బ్లాస్ట్, నేషనల్ హెరాల్డ్ కేసు ఎఫ్ఐఆర్ ల పైన మాట్లాడుతామన్నారు. విదేశాంగ విషయాల్లో ట్రంప్ చేసిన ఇండియా-పాకిస్థాన్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు, ఇండియా-యూఎస్ ట్రేడ్ చర్చలు, చైనా సంబంధిత అంశాల్లో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం తెచ్చిన కొన్ని బిల్లులపై కూడా తీవ్ర ఆందోళనలు ఉన్నాయని, అటామిక్ ఎనర్జీ బిల్ 2025, హయ్యర్ ఎడ్యుకేషన్ కమీషన్ ప్రతిపాదనలు, చండీగఢ్ రాజ్యాంగ సవరణ బిల్లులపైన ప్రజలు ఆందోళనలతో ఉన్నారన్నారు. ఇండియా కూటమి తరపున, కాంగ్రెస్ ఎన్నికల సంస్కరణలు కోరుతూ, ప్రభుత్వ ప్రాధాన్యత బిల్లులను ప్రతిఘటిస్తుందని చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. కేవలం 15 రోజులు మాత్రమే ఉన్న ఈ సెషన్‌లో, తెలంగాణ ప్రయోజనాలు మరియు ప్రజా సమస్యలను అన్ని ప్రతిపక్ష పార్టీలతో కలిసి బలంగా వినిపిస్తామని ఆయన స్పష్టం చేశారు.




## ముంబై పర్యటనకు మంత్రి దుర్గేష్.. ఫిల్మ్ టూరిజంలో పెట్టుబడులే లక్ష్యంగా..

- **రెండు రోజులు ముంబై పర్యటనకు వెళ్లిన ఏపీ మంత్రి కందుల దుర్గేష్..**
- **12వ సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ -2025కు హాజరు కానున్న మంత్రి దుర్గేష్..**
- **ఫిల్మ్ టూరిజంలో పెట్టుబడులను ఆహ్వానించనున్న మంత్రి కందుల దుర్గేష్**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఏపీ సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ డిసెంబర్ 1, 2వ తేదీల్లో ముంబైలో పర్యటించనున్నారు. ముంబైలోని జుహూలో ఉన్న జేడబ్ల్యూ మారియట్ హోటల్ లో జరగనున్న 12వ సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ 2025కు హాజరు కానున్నారు. ప్రస్తుత ఏఐ యుగంలో మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగం యొక్క భవిష్యత్తు వృద్ధికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించే ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొని కీలకోపన్యాసం చేయనున్నారు ఆయన. భారతీయ మీడియా & ఎంటర్టైన్మెంట్ రంగాన్ని $100 బిలియన్ల భవిష్యత్తు వైపు నడిపించేందుకు ఏపీ ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేయనున్నారు.
ఇక, ఆంధ్రప్రదేశ్‌ను సృజనాత్మక రంగానికి “ఆంధ్రా వ్యాలీ” గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కంటెంట్ క్రియేషన్ కోసం AI ఆధారిత టూల్స్, XR టెక్నాలజీలు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భారీగా పెట్టుబడి పెట్టడం ద్వారా యానిమేషన్, గేమింగ్, VFX లకు రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు. సుస్థిరమైన, పారదర్శకమైన, వ్యాపార అనుకూలమైన ఏపీ పరిపాలన వ్యవస్థను విశ్వసించి ఫిల్మ్ టూరిజంలో పెట్టుబడులను ఆహ్వానించనున్నారు. అలాగే, తెలుగు చలన చిత్ర పరిశ్రమకు నూతన అధ్యాయాన్ని రచిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఉదయం రాజమహేంద్రవరం ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా ముంబైకి మంత్రి దుర్గేష్ బయలుదేరి వెళ్లారు.



## క హిడ్మాను చంపితే వెయ్యి మంది హిడ్మాలు పుట్టుకొస్తారు..

- **తిరుపతి: సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు..**
- **ఐ-బొమ్మలో నేను సినిమాలు ఫ్రీగా చూశాను..**
- **తెలివితేటలు ఉన్న రవి అలా మారడానికి కారణం ఈ వ్యవస్థలే..**
- **ఒక హిడ్మాను చంపితే వెయ్యి మంది హిడ్మాలు పుడతారు: సీపీఐ నారాయణ**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతా తెలివి తేటలు ఉన్న ఇమ్మడి రవి అలా మారడానికి కారణం ఈ వ్యవస్థ లే.. ఐ బొమ్మలో సినిమాలను ఫ్రీగా నేను కూడా చూశానని తెలిపారు. ఆరేడు వందలు పెట్టి ఎలా చూసేది అని చూశాను.. వ్యవస్థలో లోపాలను సరి చేయకుంటే ఇలాంటి రవిలే పుట్టుకు వస్తారని చెప్పుకొచ్చారు. ఒకరు మంచి చేస్తే మరొకరు చెడు చేస్తారు అని సీపీఐ నారాయణ చెప్పుకొచ్చారు. ఇక, ఒక హిడ్మాను చంపితే వెయ్యి మంది హిడ్మాలు పుడతారు అని నారాయణ పేర్కొన్నారు. అలానే ఒక బొమ్మ రవిని చంపితేనో, జైల్లో వేస్తేనో మరో 100 మంది వస్తారని తెలిపారు. ఐ బొమ్మ రవినీ ఉరి తీస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదు.. సినిమా మాఫియాను ఉరి తీస్తే సమాజానికి ఉపయోగం ఉంటుంది అన్నారు. కోట్లు ఖర్చు పెట్టి టికెట్ ధరల కోసం ఆడుక్కుంటారని విమర్శించారు. సామాన్య ప్రజలను దోచుకోవడానికి ఈ ప్రభుత్వం సహాయం చేస్తుందా? అని అడిగారు. అయితే, ఈ వ్యవస్థనే ఐ బొమ్మ రవి అలా కావడనికి కారణం అని సీపీఐ నారాయణ అన్నారు. ఈ రవి పోతే మరో 100 మంది వస్తారని పోలీసులే చేబుతున్నారు.. వ్యవస్థీకృత లోపాలను సరి చేసుకోవాలి.. కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వారిని ఐబొమ్మ రవి దెబ్బ కొట్టారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి ఉంటే హిడ్మా, రవి లాంటి వారు పుడుతునే ఉంటారని నారాయణ వెల్లడించారు.

## జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం..

- **త్వరలోనే మూడు జోన్లు ఏర్పాటు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ పట్నం, అమరావతి, రాయలసీమ జోన్‌ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. విశాఖ రీజియన్‌లో 9 జిల్లాలు, అమరావతిలో 8 జిల్లాలు, రాయలసీమ జోన్‌లో 9 జిల్లాలు ఉండనున్నాయి. ఇక, నీతి ఆయోగ్, సింగపూర్ సంస్థల ఆధ్వర్యంలో ప్రణాళికలు రచిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు అయితే, ఒక్కో జోన్‌కు సీఈవోగా సీనియర్




ఐఏఎస్ అధికారులని ఏపీ ప్రభుత్వం నియమించింది. ఇక, విశాఖపట్నం జోన్‌కు సీఈవోగా యువరాజ్ ని నియమించగా.. అమరావతి జోన్‌కు సీఈవోగా మీనా.. రాయలసీమ జోన్ కు సీఈవోగా కృష్ణబాబున నియమించనున్నట్లు తెలుస్తుంది. ఈ అంశంపై ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

## నేడు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అతి భారీ వర్షాలు: ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- **తమిళనాడు-పుదుచ్చేరి తీరానికి దగ్గరగా 'దిత్వా' తుపాను**
- **గంటకు 5 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా పయనం**
- **రానున్న మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం**
- **దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలోనూ వర్షాల ప్రభావం**
- **తమిళనాడు తీరానికి సముద్రపు అలల హెచ్చరిక**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) భారీ వర్ష సూచన జారీ చేసింది. సోమవారం (డిసెంబర్ 1) రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఈ మేరకు ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు.
ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ జిల్లాల ప్రజలు, అధికారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు.
అలాగే, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ జిల్లాల్లోని రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.
ఇక కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద నిలబడవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ విజ్ఞప్తి చేసింది. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ప్రభుత్వ సూచనలను పాటించాలని ప్రజలను కోరారు.

### బలహీనపడనున్న తుపాను

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను, తమిళనాడుపుదుచ్చేరి తీరానికి అతి సమీపంలో కేంద్రీకృతమై ఉంది. గడచిన 6 గంటలుగా ఇది గంటకు 5 కిలోమీటర్ల వేగంతో నెమ్మదిగా ఉత్తర దిశగా కదులుతోంది. ఐఎండీ అంచనాల ప్రకారం, 'దిత్వా' రానున్న మూడు గంటల్లో బలహీనపడి తీవ్ర వాయుగుండంగా, రేపు ఉదయానికి వాయుగుండంగా మారనుంది. ఈ రాత్రికి ఇది తీరానికి మరింత దగ్గరగా (సుమారు 30 కి.మీ.) రానుంది. చెన్నై, కారైకాల్‌లోని డాప్లర్ రాడార్ల ద్వారా తుపాను కదలికలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలి: లావు శ్రీకృష్ణ దేవరాయలు

- **ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలని ఈసీని కోరిన టీడీపీ**
- **ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం అనంతరం లావు శ్రీకృష్ణ దేవరాయలు వెల్లడి**
- **ఇతర రాష్ట్రాల్లో ఈసీ చేపట్టిన సవరణను స్వాగతిస్తున్నామని వెల్లడి**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇదే తరహాలో ఏపీలోనూ ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు స్పష్టం చేశారు.
సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, ఆదివారం ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఈ సమావేశంలో ప్రభుత్వం అన్ని పార్టీలను కోరింది. అయితే, ఇదే సమావేశంలో ప్రతిపక్షాలు ఓటర్ల జాబితా సవరణపై ఉన్న ఆందోళనలపై పార్లమెంటులో చర్చ జరగాలని పట్టుబట్టాయి.



ఈ నేపథ్యంలో ఎన్డీయే మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ తరపున లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ.. ఏపీలో ఓటర్ల జాబితా సవరణ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అఖిలపక్ష సమావేశంలో తాము పలు కీలక అంశాలను లేవనెత్తినట్లు తెలిపారు. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీ అంశంపై ఈ సమావేశాల్లో సమగ్ర చర్చ జరగాలని కోరినట్టు వివరించారు. ఈ వివాదం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.
అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్ జీవన్ మిషన్ గురించి కూడా ప్రస్తావించినట్లు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. ఈ పథకం అమలు విధానం, దాని ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చేకూరే ప్రయోజనాలపై స్పష్టత కోసం పార్లమెంటులో చర్చ జరపాలని కోరినట్లు చెప్పారు. దీనివల్ల పథకం అమలులో పారదర్శకత వస్తుందని, రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలు పూర్తిగా అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.
ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకునేందుకు వీలుగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో SIR షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం మరో వారం పాటు పొడిగించింది. రాబోయే ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలను మరింత కచ్చితంగా, సమగ్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అండమాన్ నికోబార్ దీవులు, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.
తాజా షెడ్యూల్ ప్రకారం, గణన ప్రక్రియను డిసెంబర్ 11 వరకు పొడిగించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 16న ప్రచురించి, 2026 జనవరి 15 వరకు అభ్యంతరాలు, చేర్పులకు అవకాశం కల్పిస్తారు. తదుపరి దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉంది.

## ‘పేదల సేవలో’ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి..

- **నిరంతరం ప్రజల్లో ఉండాలని హితవు**
- **ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న టీడీపీ అధినేత**
- **పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలన్న చంద్రబాబు**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

రాజకీయ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే వారే నాయకులుగా రాణిస్తారని ఆయన చెప్పారు. ఈమేరకు పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘పేదల సేవలో’ కార్యక్రమంలో పార్టీ నాయకులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలని నేతలకు తెలిపారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో నాయకుల భాగస్వామ్యం ప్రస్తుతం 25 వేలకు చేరిందని చంద్రబాబు వెల్లడించారు.

## ఎచ్చెర్ల సమీపంలో సముద్రతీరానికి బంగ్లాదేశ్ మత్స్యకారులు

**జర్నలిస్ట్ డైరీ, ఎచ్చెర్ల:**

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం మూసవానిపేట వద్ద సముద్రతీరానికి బంగ్లాదేశ్‌కు చెందిన బోటు కొట్టుకొచ్చింది. అందులో 13 మంది మత్స్యకారులు ఉన్నారు. స్థానికులు, మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లి తప్పిపోయారు. వెంట తెచ్చుకున్న ఇంధనం, భోజన సామగ్రి అయిపోవడంతో చేసేది లేక సముద్రంలో అలా కొన్ని రోజులు ఉండిపోయారు. పశ్చిమబెంగాల్, ఒడిశా మీదుగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ మూసవానిపేట వద్ద తీరంలో లంగరు వేసుకొని ఉండిపోయారు.
గమనించిన స్థానిక మత్స్యకారులు.. సంబంధిత బోటు ఈ ప్రాంతానికి చెందినది కాదని, అందులో ఉన్నవారు అనుమానితులుగా ఉన్నట్లు గుర్తించి స్థానిక, మెరైన్ పోలీసులకు సమాచారం అందించారు. మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, స్థానిక ఎస్సై జి.లక్ష్మణరావులు సిబ్బందితో సముద్రతీరానికి చేరుకొని మూడు బోట్ల సాయంతో సముద్రంలోకి సిబ్బందిని పంపించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఒడ్డుకు వచ్చిన మత్స్యకారుల భాష, వేషధారణ ఆధారంగా బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. స్థానికులు, పోలీసులు వారితో మాట్లాడేందుకు ప్రయత్నించినా.. నీరసం, భయంతో వివరాలు చెప్పేందుకు ఇబ్బందిపడ్డారు. బంగ్లాదేశ్ భాష కొంచెం తెలిసిన స్థానిక మత్స్యకారులు వారితో మాట్లాడే ప్రయత్నం చేసి కొంత సమాచారం రాబట్టారు. వారం, పదిరోజుల నుంచి భోజనం లేదని, సముద్రంలో ఎటువెళ్తున్నామో తెలియని పరిస్థితిలో ఉండిపోయామని బంగ్లాదేశ్ మత్స్యకారులు వాపోయారు. 15 రోజులపైగా సముద్రంలో ఉండిపోయి, పరిస్థితి అల్లకల్లోలంగా ఉండటంతో భయంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒడ్డుకు చేరిన వెంటనే స్థానికులు మంటలు వేసి చలికాయించి, భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వారిని కళింగపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా సరిహద్దు దాటి మనం దేశంలోకి వచ్చిన బంగ్లాదేశ్ మత్స్యకారులపై చట్టప్రకారం కేసు నమోదుచేస్తామని మెరైన్ సీఐ తెలియజేశారు. 2008లో కూడా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్రతీరానికి బంగ్లాదేశ్ మత్స్యకారులు తప్పిపోయి కొట్టుకొచ్చారు.



## రాష్ట్రంలో రైతుల పరిస్థితి దుర్భరంగా ఉంది..

- **రైతులు బ్లాక్ మార్కెట్□లో ఎరువులు కొని పంటలు పండించాల్సిన పరిస్థితి..**
- **పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయారు..**
- **కూటమి ప్రభుత్వం రైతుల్ని ఆదుకునే దాఖలాలు కనపడలేదు..**
- **రైతులకు ఎప్పుడు సాయం చేస్తారో కూటమి నేతలు చెప్పాలి: బొత్స సత్యనారాయణ**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దుర్భరంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



అన్నారు. రైతులు గానీ, రైతు కూలీలు పంటకు కావాల్సిన ఎరువుల కోసం ఎంతలా కొట్లాడారో చూశాం.. బ్లాక్ మార్కెట్ లో ఎరువులు కొనుక్కొని పంట పండించిన పరిస్థితి ఏర్పడింది.. ఆ పంట చేతికొచ్చిన తర్వాత ప్రకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోయారు.. ప్రభుత్వం ఎక్కడ రైతులను ఆదుకున్న దాఖలాలు కనపడలేదని ఎద్దేవా చేశారు. చేతికొచ్చిన పంటను అమ్ముకుందాం అనుకుంటే గత ఏడేనిమిది ఏళ్ళల్లో ఎన్నడూ లేని విధంగా ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారు.. ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లేదు.. అరటి, మొక్క జొన్న, పొగాకు, ప్రత్తి ఏ పంటకు కూడా సరైన గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో చెరుకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంట వేసుకుంటున్నారు.. గత ప్రభుత్వ హయాంలో పంటకు కొనుగోలులో ఇబ్బందులు వస్తే వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లు కేంద్రాలను ఏర్పాటు చేసిందని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.
అయితే, నేటి ప్రభుత్వ హయాంలో రైతుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదని మాజీ మంత్రి బొత్స అన్నారు. రైతులు నష్టపోతుంటే కేంద్రానికి లేఖలు రాయడం ఏమిటి? అని ప్రశ్నించారు. రైతులు మొదట నష్టపోతే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.. ఆ తర్వాత కేంద్రానికి లేఖలు రాసి రియంబర్స్మెంట్ పొందాలని తెలిపారు. ఇది ఆనాదిగా వస్తున్న వ్యవహారం.. కానీ, నేడు అలాంటి పరిస్థితి లేదు.. ప్రతిపక్షంలో మేము ప్రశ్నిస్తుంటే రాజకీయం చేస్తున్నామని అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. మా మీద లేనిపోని నిందలు వేస్తున్నారు.. మొక్క జొన్నకు సంబంధించిన కేంద్రాలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదు.. ఇప్పటికే రైతులు బక్కచిక్కుపోతున్న సమయంలో రైతుల మీద ఎందుకు ఇంత చిన్న చూపులు, ఎందుకు అలసత్వం అని బొత్స సత్యనారాయణ చెప్పుకొచ్చారు.
ఇక, వ్యవసాయ శాఖ మంత్రి ఆలోచించాలి, మీరు ఈ ప్రాంతానికి చెందిన వారే కదా అని ఎమ్మెల్సీ సత్యనారాయణ కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి రైతులన్నా, రైతు సమస్యలన్న అక్కర్లేదు.. ఎంత సేపు పెద్ద పెద్ద వాటి కోసమే ఆలోచిస్తుంటారు.. విశాఖలో ఎక్కడ ఖాళీ భూములు ఉన్నాయి.. రూపాయికి ఇచ్చేద్దామని ఆలోచనలోనే ఉంటారు.. బ్యాక్ డోర్ లో ఏ విధంగా దోచుకుని తిందామనే ఆలోచన తప్ప మరి ఇంకేం లేదని విమర్శించారు. రైతులకు కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?.. ఇప్పటికే 70 నుంచి 80 శాతం వరకు ప్రైవేట్ మార్కెట్లలో తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల పరిస్థితి చాలా దీనంగా ఉంది.. వ్యవసాయ స్థితిగతులు మారాలని బొత్స సత్యనారాయణ అన్నారు.



## ముఖంపై మచ్చలు, మెటిమలు పోవాలంటే..

# ఇవి ట్రై చేయండి





అందంగా ఉండాలని ఎవరూ కోరుకోరు. మెరిసే చర్మం, అందమైన ముఖం ఉండాలని ప్రతి ఒక్కరూ తాపత్రాయపడుతుంటారు. అమ్మాయిలు మాత్రమే కాదు అబ్బాయిలు కూడా ఈ రోజుల్లో అందంపై దృష్టి ఎక్కువ పెడుతున్నారు. ఇక, అందమైన ముఖం కోసం బ్యూటీ పార్లర్ చుట్టూ తిరుగుతుంటారు. రకరకాల ఫేషియల్స్ చేయించుకుంటారు. మార్కెట్ లో దొరికే ప్రొడక్ట్స్ వాడుతుంటారు. ఇవన్నీ ఖర్చుతో కూడుకున్న పనులు. కొందరికి పార్లర్ల చుట్టూ దొరికే సమయం ఉండదు. అందుకే ఇంట్లో దొరికే వాటితో అందాన్ని రెట్టింపు చేసుకోవచ్చు. అలాంటి వాటిలో పచ్చి పాలు ముందు ఉంటుంది.పచ్చి పాలతో అందాన్ని రెట్టింపు చేసుకోవచ్చు. సాధారణంగా పాలు తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఆరోగ్యానికి మాత్రమే కాదు పాలను ఉపయోగించడం వల్ల చర్మానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయని కొద్ది మందికే తెలుసు. చలికాలంలో చర్మ సంరక్షణలో పాలను చేర్చుకోవచ్చు. పచ్చి పాలలో అనేక పోషకాలు, ఎంజైమ్‌లు, ప్రయోజనకరమైన బ్యాక్టీరియా సమృద్ధిగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా, సహజంగా మెరిసేలా చేస్తాయి. పచ్చి పాలతో ప్రయోజనాలు, చర్మ సంరక్షణ చాలా సులభం పచ్చి పాలు మాయిశ్చరైజింగ్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది చర్మాన్ని హైడ్రేట్ చేయడానికి సహాయపడుతుంది. పచ్చి పాలలో ప్రోటీన్లు, సహజకొవ్వులు, తేమ శాతం ఉన్నాయి. పచ్చి పాలు తేమ సమతుల్యతను పునరుద్ధరించడానికి, నిర్వహించడానికి దోహదం చేస్తుంది. పచ్చి పాలు ఉపయోగించడం వల్ల చర్మం మరింత మృదువుగా కనిపిస్తుంది. పచ్చి పాలలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది మొటిమలు, వడదెబ్బ, చర్మపు చికాకు వంటి వివిధ చర్మ సమస్యల నుంచి కాపాడుతుంది. ఇది కాకుండా, పచ్చి పాలను ఉపయోగించడం వల్ల చర్మంపై ఎర్రబడడం తగ్గుతుంది. సున్నితమైన చర్మం ఉన్నవారికి పచ్చి పాలు బెస్ట్ ఆప్షన్ అని చెప్పుకోవచ్చు. పచ్చి పాలలో విటమిన్ ఎ, డి, ఇ వంటి యాంటీ ఆక్సిడెంట్లతో పాటు బీటాకేసిన్ ప్రొటీన్ మంచి మొత్తంలో ఉంటుంది. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హాని నుంచి చర్మాన్ని రక్షించడం ద్వారా వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడంలో, కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడంలో సాయపడతాయి. దీంతో చర్మంపై గీతలు, చారలు, ముడతలు తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది.



## పుట్టగొడుగులు తింటే

# ఇన్ని ప్రయోజనాలా?

పుట్ట గొడుగులు తినడం ఆరోగ్యానికి చాలా మంచిదన్న విషయం తెలిసిందే. వీటినే మష్రూమ్స్ అని కూడా అంటారు. మష్రూమ్స్ తినడం వల్ల బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉంటాయి. రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ప్రతి రోజూ తగిన మోతాదులో తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. పుట్ట గొడుగులను ఇప్పుడు అందరూ తింటున్నారు. వీటిల్లో అనేక రకాలు కూడా ఉన్నాయి. మష్రూమ్స్‌లో ఒక రకం తినడం వల్ల క్యాన్సర్‌ను కంట్రోల్ చేసుకోవచ్చని.. ఇటీవల జరిగిన పలు అధ్యయనాల్లో తేలింది. ఈ రకం పుట్ట గొడుగులు గుండ్రంగా, నల్లగా ఉంటాయి. వీటిని పూర్వం పలు రకాల మందుల తయారీలో ఉపయోగించేవారట. ఇప్పుడు వీటిని తినడం వల్ల క్యాన్సర్‌ను తగ్గించకోవచ్చు. వీటిని జన్యుపరమైన మార్పుల వల్ల తెలుపు రంగులో పండిస్తున్నారు. ఫ్రాన్స్‌లోని అడవుల్లో ఈ మష్రూమ్స్‌ని పెంచుతున్నారు. వీటిని ట్రఫిల్ పుట్టగొడుగులు అంటారు. ఇవి ఆరోగ్యానికి చాలా మంచిది. వీటి ధర చాలా ఎక్కువగా ఉంటుంది. ఒక కిలో రూ.2 వేల నుంచి ఏడు వేల రూపాయలకు పైగానే పలుకుతుంది. కానీ వీటిని తింటే ప్రాణాంతకరమైన క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చు. ఈ ట్రఫిల్ పుట్టగొడుగుల నుంచి ఆయిల్ కూడా తీస్తారు. ఇది మరింత ఖరీదు. కేవలం ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా వీటిని తీసుకోవచ్చు. ఈ ఆయిల్ వాడటం వల్ల ఆహారాలు రుచి మరింత పెరుగుతుంది.





## జ్ఞాపకశక్తి పెరగాలా..

# ఇవి తినండి



చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బ్రెయిన్ పవర్ పెంచుకోవాలని చూస్తుంటారు. మానవ శరీరంలో సుమారు 1400 గ్రాములున్న మెదడు చాలా ముఖ్య భాగం. శరీరంలో ఏ అవయవమైనా సరే పనిచేయాలన్నా మెదడు అనుమతి తప్పనిసరి. అందుకే ప్రతి ఒక్కరూ మెదడు షార్ప్‌గా ఉండాలని కోరుకుంటారు. చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బ్రెయిన్ పవర్ పెంచుకోవాలనుకుంటారు. ఇక, బ్రెయిన్ షార్ప్ చేసే ఎన్నో ఆహారాలు ఉన్నాయి. రోజూ బాదం పప్పు తింటే మెదడు షార్ప్ అవుతుందని చాలా మంది చెబుతుంటారు. నల్ల మిరియాలు మెదడుకు టానిక్ లేదా జ్ఞాపకశక్తిని పెంచేవిగా పరగణిస్తారు. ఆయుర్వేదంలో, నల్ల మిరియాలు నిర్విషీకరణ లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ మిరియాలతో ఎన్నో లాభాలు ఉన్నాయి. బాదం పప్పుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. బాదం పప్పులో పోషకాలు మెండుగా ఉన్నాయి. భావప్రకాష్ నిఘంటు అనే ఆయుర్వేదానికి సంబంధించిన పుస్తకంలో.. మెదడు చురుగ్గా పనిచేస్తుందని ఏమీ లేదు. కానీ మిరియాలు, బాదం పప్పుకు తేనె కలిపితే, ఫలితాలు కచ్చితంగా మంచివని వైద్యులు నమ్ముతున్నారు. తేనెతో కలిపి తినడం వల్ల శరీరానికి ప్రయోజనాలు అందుతాయని వైద్యులు చెబుతున్నారు. జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి ఈ చిట్కాలు పనిచేస్తాయన్నా ఎటువంటి ఆధారాలు లేవు. కానీ వాటిలో ఉన్న పోషకాలు కచ్చితంగా మెదడు ఆరోగ్యంలో కీలక పాత్రో పోషిస్తాయి.





# “సఃకుటుంబానాం” ట్రైలర్ లాంచ్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు..!

హెచ్ ఎన్ జి సినిమాస్ ఎల్ ఎల్ పి బ్యానర్ పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్ గా శశాంక్ మలి చేశారు. విడుదల తేదీ దగ్గరవుతున్న సందర్భంగా ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు సనా చేతుల మీదగా సఃకుటుంబానాం చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా బుచ్చిబాబు సనా మాట్లాడుతూ.. “అందరికీ నమస్కారం. బ్రహ్మానందం గారు, రాజేంద్ర ప్రసాద్ గారు నటించిన నాన్నకు ప్రేమతో, ఆర్య 2 చిత్రాలకు నేను అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేశాను. ఇప్పుడు వారి పక్కన నిలబడి డైరెక్టర్ గా మాట్లాడడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. నా స్నేహితుడు విక్రమ్ ఒక లైన్ సినిమాగా చేయాలి అనుకున్నాడు కానీ ఆయన చనిపోవడం జరిగింది. అదే లైన్ ను తన స్నేహితుడు ఉదయ్ ఒక కథగా మార్చి ఆ కథను సినిమాగా చేస్తున్నాను అని చెప్పినప్పుడు నేను చాలా సంతోషించాను. ఈ సినిమా సుకుమార్ గారి ఐడియాలో ఉండబోతుంది. సఃకుటుంబానాం చిత్రం మంచి విజయం సాధించాలని నటీనటులకు, నిర్మాతకు, సాంకేతిక బృందానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆల్ ది బెస్ట్” అన్నారు.

నటకిరీటి రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ... “సభా సరస్వతికి, నా తెలుగు ప్రేక్షకులకు నమస్కారం. బ్రహ్మానందం మరొకసారి కలిసిన నటించడం, మధు పనిచేసిన వారంతా ఉన్నత స్థాయిలకు అడగడం, వారిని ఈ స్టేజిపై చూడటం నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఒక నటుడు ఎంతో కాలం పాటు చిత్ర పరిశ్రమలో కనిపిస్తూ ఉండటం అనేది ఎంతో ప్రత్యేకమైన విషయం. ఒక నటుడు అలా కనిపించాలి అంటే తాము వేసే పాత్ర ప్రేక్షకులను అంతగా మెప్పించాలి. వివిధ ప్రాంతీయ భాష యాసాలను సినిమాలలో మాట్లాడుతూ ప్రతి ప్రాంతం వారికి దగ్గర వాడిని అయ్యాను. ఒక కొత్త పాత్రతో మా దగ్గరకు కథ వచ్చిన ప్రతిసారి ఆశ్చర్యపోతూ ఉంటాము. సఃకుటుంబానాం వంటి కథ 48 సంవత్సరాలలో నేను ఎప్పుడూ వినలేదు, చేయలేదు. ఈ సినిమా అంత ప్రత్యేకంగా ఉండబోతుంది. నన్ను ఒక నటుడుగా తీర్చిదిద్దిన మహనీయుడు ఎన్టీ రామారావు గారు. ఆయన దగ్గర నేర్చుకున్న పని అందరికీ ఉపయోగపడటం గర్వించదగిన విషయం. ‘ఆ నలుగురు’ సినిమాలో నన్ను చూసినవారు అంత రాజేంద్రప్రసాద్ ఇటువంటి పాత్రనైనా చేయగలనుకున్నారు. సఃకుటుంబానాం వంటి సినిమాలో నాకు ఇచ్చిన పాత్ర చాలా ఛాలెంజ్ లు ఉన్నాయి. ఒక మనిషికి కుటుంబం ఎంత అవసరం అనేది తెలియజేస్తూ, కుటుంబ నేపథ్యంలో కుటుంబ గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను తెలుపుతూ రానున్న చిత్రం సఃకుటుంబానాం. కచ్చితంగా ఈ చిత్రం ప్రేక్షకులు అందరికీ నచ్చుతుంది. ఈ చిత్రంలో హీరోగా నటించిన రామ్ కిరణ్ ఎంతో శ్రద్ధతో నేర్చుకుని నటించారు. అలాగే ఈ సినిమాలో నటీనటులు అంతా కూడా అద్భుతంగా నటించారు. నిర్మాత మహదేవ్ గౌడ్ గారు ఇటువంటి సినిమాలు మరిన్ని తీయాలని, తరువాత తరాలకు ఉపయోగపడే ఇటువంటి సినిమాలు మరిన్ని రావాల్సిందిగా కోరుకుంటున్నాను. సఃకుటుంబానాం చిత్రాన్ని థియేటర్ లో చూడాల్సిందిగా అందరిని కోరుకుంటున్నాను” అన్నారు.

హాస్యబ్రహ్మ బ్రహ్మానందం గారు మాట్లాడుతూ... “అందరికి నమస్కారం. ఈ సినిమాకు దర్శకుడు ఉదయ్ శర్మ తనకు కావలసిన ఔట్పుట్ వచ్చేవరకు కచ్చితంగా చూసుకుని అద్భుతమైన దర్శకుడు. అతడి వెనుక అర్జున్ సాయి ఉన్నాడు. అతను ప్రతి విషయంలను అండగా ఉండి నడిపిస్తుంటాడు. మా గురువుగారు రాజేంద్రప్రసాద్ గారి చేత కూడా తనకు ఎలా కావాలి అనుకున్నారో అలా నటించేలా చేసి అవుట్ పుట్ తీసుకున్నారు. నిర్మాత మహదేవ్ గౌడ్ గారికి ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో నా పాత్ర చాలా చిత్రంగా ఉండబోతుంది. ఈ చిత్రంలో హీరోగా నటించిన రామ్ కిరణ్ ఒక డాన్సర్. హీరో, హీరోయిన్ కలిసి ఉండే కొన్ని సీన్స్ లో నేను నటించాను. నాకు చాలా ముచ్చటగా అనిపించింది. ఈ సినిమాను మంచి విజయం చేయాలని ప్రేక్షకులను కోరుకుంటున్నాను” అన్నారు.

నిర్మాత మహదేవ్ గౌడ్ మాట్లాడుతూ.. “అందరికి నమస్కారం. సఃకుటుంబానాం హెచ్ ఎన్ జి బ్యానర్ పై తొలి చిత్రం. ఈ సినిమా కథ నాకు చాలా నచ్చి కావలసిన నటీనటులను, టెక్నీషియన్స్ ను అందరిని కష్టపడి ఈ చిత్రంలో పాలుపంచుకునేలా చేశాము. ఈ సినిమాలో అందరూ సపోర్ట్ చేసి మంచి విజయాన్ని అందించవలసిందిగా కోరుకుంటున్నాను” అన్నారు.

దర్శకుడు ఉదయ్ శర్మ మాట్లాడుతూ.. “ముందుగా సఃకుటుంబానాం చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కు ముఖ్య అతిథిగా వచ్చిన బుచ్చిబాబు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అలాగే రాజేంద్రప్రసాద్ గారికి, బ్రహ్మానందం గారికి, మణిశర్మ గారికి తదితరులకు అందరికీ మా కోసం ఈ సినిమా చేసినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నేను ఈ స్టేజ్ పై ఉండటానికి ముఖ్య కారణం నా స్నేహితుడు విక్రమ్, అర్జున్ సాయి, నిర్మాత మహదేవ్ గౌడ్. మా హీరో రామ్ కిరణ్, హీరోయిన్ మెగా ఆకాష్ ఎంతో పెర్ఫెక్ట్ గా నటించారు. నా తొలి చిత్రానికి మని శర్మగారు సంగీతం అందించడం అనేది ఒక గొప్ప విజయంగా భావిస్తున్నాను. మా డిఓపి మధు తన ఈ తొలి చిత్రంలోనే మంచి విజువల్స్ చూపించారు. సినిమాకు మంచి విజయం అందిస్తారని కోరుకుంటున్నాను” అన్నారు.

హీరో రామ్ కిరణ్ మాట్లాడుతూ.. “అందరికీ నమస్కారం. నన్ను హీరోగా నమ్మి ముందుకు వచ్చిన నిర్మాత మహదేవ్ గౌడ్ గారికి నా థ్యాంక్స్. హీరో కావడం కోసం నేను ఎంతో కష్టపడ్డాను, ఎన్నో కథలో విన్నాను. నాకు ఎంతో ఇష్టమైన తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగు పెట్టాను. అందరూ ఈ సినిమాను ఆదరించవలసిందిగా కోరుకుంటున్నాను. దీనికి ముఖ కారణమైన నిర్మాతలకు మరొకసారి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఎంతోమంది స్టార్ హీరోలతో నటించిన మెగా ఆకాష్ గారితో నేను నటించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఆమెతో కలిసి పని చేస్తూ నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. మా దర్శకుడు ఉదయ్ శర్మ గారు ఒక కథ తీసుకుని, ఆ కథ చుట్టూ ఒక కుటుంబాన్ని సృష్టించుకోవడం గొప్ప విషయం. మణిశర్మ గారు మా సినిమాకు సంగీతం అందించడం అనేది ఒక అదృష్టంగా భావిస్తున్నాను. 16 సంవత్సరాల నా కల హీరో కావడం. దీనికి కారణం నా గురువులు, వారికి నా జీవితాంతం రుణపడి ఉంటాను. నా సినిమా కోసం కొరియోగ్రఫీ చేసిన నా డాన్స్ మాస్టర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మా చిత్ర టైలర్ లాంచ్ ఈవెంట్ కు వచ్చిన బుచ్చిబాబు గారికి, మాతో కలిసి నటించిన రాజేంద్రప్రసాద్ గారికి, బ్రహ్మానందం గారికి మరొకసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అల్లు అర్జున్ గారి డాన్స్ అంటే నాకు చాలా ఇష్టం. నా స్ఫూర్తి అల్లు అర్జున్ గారు, కచ్చితంగా ఒక రోజు ఆయనతో కలిసి పనిచేస్తాను. అందరూ ఈ సినిమాకు సపోర్టు చేయవలసిందిగా కోరుకుంటున్నాను” అంటూ ముగించారు.

## వేసవిలో శ్రీలీల ప్రేమ కబుర్లు

తన స్టెప్పలతో యువతను విశేషంగా ఆకట్టుకునే శ్రీలీల.. బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రొమాంటిక్ డ్రామాకు అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే తెరపైకి రావాల్సిన ఈ సినిమా కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ఇప్పుడు దీన్ని వచ్చే ఏడాది వేసవి సందర్భంగా మే 1న థియేటర్లలోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. భావోద్వేగాలు, సంగీతమే ప్రధాన ఆకర్షణగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో ఓ ప్రముఖ సంగీత దర్శకుడు అతిథి పాత్రలో మెరవనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు ‘తూ మేరి జిందగీ హై’ అనే పరిశీలనలో ఉంది. మరి దక్షిణాదిలో కుర్రకారుని ఉర్రూతలూగిసోన్న శ్రీలీల.. కార్తిక్‌తో కలిసి బాలీవుడ్ ప్రేక్షకులకు ఎలాంటి ప్రేమకబుర్లు చెప్తుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.








Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465